ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

5



చిత్తూరు
జిల్లా వార్తలు
సోమవారం 18 మార్చి 2024



ఎన్నికలకు సన్నద్ధమవుతున్న యంత్రాంగం

● ఆర్వోల నియామకం.. సమస్యాత్మక కేంద్రాల గుర్తింపు

సార్వత్రిక ఎన్నికలకు ఎన్నికలకు శనివారం షెడ్యూల్ విడుదల కావడంతో.. ఏర్పాట్లకు అధికార యంత్రాంగం సన్నద్ధమైంది. ఆర్వోల నియామకం, పోలింగ్ కేంద్రాల గుర్తింపు పూర్తికాగా, సిబ్బందికి శిక్షణ ఇస్తున్నారు. జిల్లాలో 1266 ప్రాంగణాల్లో 1771 పోలింగ్ కేంద్రాలను అధికారులు సిద్ధం చేశారు. పుంగనూరు నియోజకవర్గంలో 265, నగరిలో 231, జీడీనెల్లూరులో 256, చిత్తూరులో 226, పూతలపట్టులో 262, పలమనేరులో 288, కుప్పంలో 243 చొప్పున పోలింగ్ కేంద్రాలున్నాయి. జిల్లాలోని 23,503 మంది దివ్యాంగ.. 5167 మంది 85 ఏళ్లు పైబడి ఓటర్లకు ఇంటి నుంచే ఓటేసే అవకాశముంది. ఒకవేళ వీరు పోలింగ్ కేంద్రానికి వచ్చి కూడా ఓటేయొచ్చు. అలాంటి వారి కోసం.. మిగిలిన పాక్షిక దివ్యాంగులు, వృద్ధులకోసం ప్రతి పోలింగ్ వద్ద ర్యాంపులు, వీల్ చైర్లను ఏర్పాటు చేస్తున్నారు.

- చిత్తూరు, ఆంధ్రజ్యోతి

415 సమస్యాత్మక కేంద్రాలు

మొత్తం 415 సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను అధికారులు గుర్తించారు. గత ఎన్నికల్లో 90 శాతానికిపైగా ఓట్లు పోలైనా, 10 శాతానికి తక్కువగా పోలైనా, ఒకే అభ్యర్థికి 75శాతం ఓట్లు వచ్చినా సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలుగా గుర్తించారు. ఇలాంటి కేంద్రాల్లో వెబ్ కాస్టింగ్, వీడియోగ్రఫీ, మైక్రో అబ్జర్వర్లలో ఓ దాన్ని ఏర్పాటు చేస్తారు. ఆయా కేంద్రాల్లో కేంద్ర బలగాలు విధుల్లో ఉంటాయి.

ఎన్నికల విధులకు వలంటీర్లు దూరం

ఎన్నికల ప్రచారం, పోలింగ్ రోజున ఏజెంట్లుగా వలంటీర్లు కూరోచరాదు. ఇక, సచివాలయాల్లో ఏఎన్ఎం మినహా మిగిలిన ఉద్యోగులను ఎన్నికల విధులకు వినియోగించుకోనున్నారు. ఇప్పటికే కొందరిని బీఎల్వోలుగా నియమించగా, పోలింగ్ రోజున వారంతా కేంద్రంలో ఓటర్లకు సహాయకులుగా వ్యవహరిస్తారు. అంగన్వాడీ, ఆశా కార్యకర్తలతో పాటు అవుట్ సోర్సింగ్ ఉద్యోగులను అవసరాన్ని బట్టి మాత్రమే అనుమతి తీసుకుని వినియోగించుకుంటామని కలెక్టర్ అన్నారు.

ఎన్నికల విధులకు గైర్హాజరైతే సస్పెన్షన్

ఎన్నికల నిర్వహణపై 4800 మంది సిబ్బందికి శిక్షణ ఇస్తున్నారు. ఎన్నికల విధులకు గైర్హాజరైతే సస్పెండు చేస్తామని అధికారులు హెచ్చరిస్తున్నారు. ఇప్పటికే శిక్షణకు హాజరుకాని 16 మందిని కలెక్టర్ షన్మోహన్ సస్పెండు చేశారు. ఈ సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని అంటున్నారు. ఇక, ప్రతి పోలింగ్ కేంద్రంలో కనీసం ఆరుగురు సిబ్బంది ఉండేలా చూసుకోవడంతో పాటు అదనంగా 20 శాతం సిబ్బందిని నియమిస్తున్నారు.

కోడ్ అమలుకు బృందాలు

ఎన్నికల కోడ్ అమలుకు మున్సిపాలిటీల్లో కమిషనర్లు, మండలాల్లో ఎంపీడీవోల ఆధ్వర్యంలో బృందాలను ఏర్పాటు చేస్తున్నారు. ప్రతి టీమ్‌లోనూ ఓ పోలీసు అధికారి ఉంటారు. కోడ్ ఉల్లంఘనలకు సంబంధించి అధికారులతో పాటు సీ-విజిల్ యాప్‌లోనూ ఫిర్యాదు చేయొచ్చు. ఫిర్యాదును 100 గంటల్లోగా పరిష్కరించేలా అధికారులు బాధ్యత వహిస్తారు. కలెక్టరేట్‌లో ఎన్నికలకు సంబంధించిన జిల్లా కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేసి అగ్రికల్చర్ జేడీ మురళీకృష్ణకు బాధ్యతలు అప్పగించారు.

తాత్కాలికంగా ఆగిన ధ్రువపత్రాల మంజూరు

సచివాలయాలు, మీసేవ కేంద్రాల్లో ప్రింట్ తీసుకునే వివిధ ధ్రువపత్రాలు, వెబ్‌సైట్లమీద సీఎం జగన్ ఫొటోలు ఉన్నాయి. దీంతో ఆయా ధ్రువపత్రాల మంజూరునూ తాత్కాలికంగా ఆపేశారు. వెబ్‌సైట్లలో ఫొటోలు లేకుండా చేసి, ఫొటోల్లేని కొత్త ధ్రువపత్రాలను తెప్పించి ప్రింట్ చేసిస్తారు.

అభ్యర్థుల ఖర్చు లెక్కింపు

ఎంపీ అభ్యర్థిగా పోటీ చేసేవారు రూ.95 లక్షల వరకు, ఎమ్మెల్యే అభ్యర్థులుగా పోటీ చేసేవారు రూ.40 లక్షల వరకు ఎన్నికల ఖర్చు చేసుకోవచ్చు. నామినేషన్లు వేసినప్పటి నుంచి అభ్యర్థుల ఖర్చును లెక్కిస్తారు. అంతకుముందు చేసే ఖర్చును ఆయా పార్టీల ఖాతాల్లో వేస్తారు. ఈ ఖర్చును లెక్కించేందుకు ప్రత్యేక టీమ్‌లను ఏర్పాటు చేశారు.

ప్రచార సమయమిలా.. : ఆయా పార్టీల అభ్యర్థులు ఎన్నికల ప్రచారాలను ఉదయం 6 నుంచి రాత్రి 10 వరకు నిర్వహించుకోవచ్చు. ఆ తర్వాత అభ్యర్థి ఒకరే ఇంటింటి ప్రచారం చేసి ఓట్లు అడగవచ్చు. ఇక, ప్రచారంలో భాగంగా ఆయా ప్రాంతాల్లో సభలు, సమావేశాలు నిర్వహించేందుకు ఏ అభ్యర్థి ముందుగా దరఖాస్తు చేసుకుంటారో, అనుమతి మంజూరులో వారికే ప్రాధాన్యం ఉంటుంది. ఈ అనుతుల కోసం జడ్పీ సీఈవో గ్లోరియా ఆధ్వర్యంలో టీమ్‌ను ఏర్పాటుచేశారు.

ఓటుకోసం ఏప్రిల్ 1 వరకు దరఖాస్తు

మే నెలలో పోలింగ్ నేపథ్యంలో ఏప్రిల్ ఒకటో తేది వరకు ఓటు నమోదుకు దరఖాస్తు చేసుకోవచ్చు. ఆ తర్వాత ఏడు రోజుల పాటు దరఖాస్తును ప్రాసెస్ చేసి అర్హతను బట్టి ఓటుహక్కును కలిగిస్తారు. వీరంతా మే 13న ఓటు వేయొచ్చు.

రెండు శాతం కొత్త యువ ఓటర్లు

ఈసారి 18-19 ఏళ్ల మధ్య వయసున్నవారు 36,083 మంది కొత్తగా ఓటు హక్కు నమోదు చేసుకున్నారు. వీరిలో 18766 మంది యువకులు, 16317 మంది యువతులున్నారు. జిల్లా ఓటర్లలో 2 శాతం ఉన్న వీరంతా ఈ ఎన్నికల్లో తొలిసారి ఓటు వేయనున్నారు.

చంద్రగిరి నిర్వహణ తిరుపతి యంత్రాంగం బాధ్యత

పార్లమెంటు నియోజకవర్గాల వారీగా జిల్లాల విభజన జరిగినా, చిత్తూరు పార్లమెంటులోని చంద్రగిరి నియోజకవర్గం పూర్తిగా తిరుపతి జిల్లాలో కలిసింది. అలాగే రాజంపేట పార్లమెంటు పరిధిలోని పుంగనూరు నియోజకవర్గం చిత్తూరు జిల్లాలో కలిసింది. వచ్చే ఎన్నికల్లో చంద్రగిరి నియోజకవర్గంలో ఎన్నికల నిర్వహణ బాధ్యత పూర్తిగా తిరుపతి కలెక్టర్ ఆధ్వర్యంలో జరుగుతుంది. చంద్రగిరి నియోజకవర్గానికి సంబంధించిన ఓట్ల లెక్కింపు కూడా తిరుపతిలోనే చేస్తారు. రౌండ్ల వారీగా ఫలితాలు ఎప్పటికప్పుడు చిత్తూరు యంత్రాంగానికి పంపిస్తారు. ఎన్నికల కోడ్ అమలు తీరు పర్యవేక్షణ బాధ్యత కూడా పూర్తిగా తిరుపతి యంత్రాంగానిదే. గెలిచిన అభ్యర్థికి డిక్లరేషన్ కూడా తిరుపతిలోనే ఇస్తారు. ఇదే తరహాలో పుంగనూరు నియోజకవర్గ ఎన్నికల తంతు మొత్తాన్ని చిత్తూరు యంత్రాంగం చూస్తుంది. రౌండ్ల వారీగా ఫలితాలను మాత్రం అన్నమయ్య జిల్లా అధికారులకు పంపిస్తారు.

ఎన్నికలయ్యే వరకు స్పందన రద్దు

చిత్తూరు: ఎన్నికలు ముగిసే వరకు స్పందన కార్యక్రమాన్ని రద్దు చేసినట్లు కలెకర్ షన్మోహన్, ఎస్పీ జాషువా వేర్వేరు ప్రకటనల్లో తెలిపారు. జిల్లాలో కోడ్ ఉన్నందున ఈ నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొన్నారు. అర్జీలు ఇవ్వడానికి ఎవరూ జిల్లా కేంద్రానికి రావద్దని కోరారు.

ప్రశాంత ఎన్నికలకు సర్వం సిద్ధం

● ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చిందన్న కలెక్టర్
● అవాంఛనీయ ఘటనలు జరగనివ్వమని ఎస్పీ ప్రకటన



మాట్లాడుతున్న కలెక్టర్, పక్కన ఎస్పీ

చిత్తూరు కలెక్టరేట్: ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించేందుకు జిల్లా యంత్రాంగం సిద్ధంగా ఉందని కలెక్టర్ షన్మోహన్ అన్నారు. ఆదివారం ఆయన కలెక్టరేట్‌లో ఎస్పీ జాషువా, జేసీ శ్రీనివాసులు, డీఆర్వో పుల్లయ్యతో కలిసి మీడియా సమావేశంలో మాట్లాడారు. షెడ్యూల్ ప్రకటించిన రోజు నుంచే కోడ్ అమల్లో ఉంటుందని, ఆయా పార్టీల అభ్యర్థులు పాటించాలని కోరారు. సభలు, సమావేశాలు, వాహనాలకు ముందస్తు అనుమతి పొందాలన్నారు. కోడ్ అమలు పర్యవేక్షణకు 42 ఎంసీసీ బృందాలు, 21 ఎస్ఎస్‌టీ టీములు, 21 ఫ్లయింగ్ స్క్వాడ్, 21 వీడియో బృందాలు, 14 వీడియో వీక్షణ బృందాలను ఏర్పాటు చేసినట్లు వివరించారు. జిల్లాలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ఏర్పాట్లు సిద్ధం చేసినట్లు ఎస్పీ తెలిపారు. 30 పోలీసు యాక్టు అమల్లో ఉన్నందు ర్యాలీలు, సభలు, సమావేశాల కోసం డీఎస్పీల నుంచి అనుమతి తీసుకోవాలని సూచించారు. ఇప్పటికే మూడు కంపెనీలకు చెందిన కేంద్ర బలగాలు వచ్చాయన్నారు. ఆయా ప్రాంతాల్లో ప్రజలకు నమ్మకం కోసం కవాతు నిర్వహించామని వివరించారు. ఎన్నికల నాటికి మరిన్ని కేంద్ర బలగాలు వస్తాయన్నారు.

ఈ బోర్డులు తీయరా?



గుడిపాల: ఎన్నికల కోడ్ వచ్చినా గుడిపాలలోని దుకాణాలు, భవనాలపై పెట్టిన మా నమ్మకం నువ్వే జగన్ బోర్డులను తీయలేదు. ఈ విషయమై తహసీల్దార్ విజయలక్ష్మిని వివరణ కోరగా.. ఆ బోర్డుల గురించి క్లియరెన్స్ రాలేదని చెప్పారు.

24 గంటలు దాటినా..!

● తొలగని ఫ్లెక్సీలు.. కార్యాలయాలపై ప్రచార సిత్రాలు



కెంపసముద్రంలో పాలవెల్లువ కేంద్రం గోడలపై జగన్ పేరు, ఫొటోలు





ట్యాంకు వద్ద బోర్డులో ప్రధాని, సీఎం జగన్ ఫొటోలు - కొళ్ళపల్లెలో సీఎం జగన్ ఫొటోలు ఉన్న ఫ్లెక్సీలు

రామకుప్పం, మార్చి 17: ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చిన 24 గంటల్లోగా కటౌట్లు, ఫ్లెక్సీలు తొలగించాలని అధికారులు ఆదేశించారు. కానీ, రామకుప్పం మండలంలో పలుచోట్ల అధికార పార్టీకి చెందిన ఫ్లెక్సీలు అలాగే ఉన్నాయి. గోడలకు, తాగునీటి ట్యాంకులకు వైసీపీ రంగులున్నా తొలగించలేదు. కెంపసముద్రం పాల వెల్లువ కేంద్రంపై సీఎం జగన్ ఫొటోతో.. పథకాల ప్రచారమున్నా పట్టించుకోలేదు. మిట్టపల్లెలో జలజీవన్ మిషన్ తాగునీటి ట్యాంకుకు వైసీపీ రంగులు ఉండటం.. పక్కనే ఉన్న బోర్డులో సీఎం, పీఎం ఫొటోలు అలాగే ఉంచారు. కొంగనపల్లె పంచాయతీ కొళ్ళపల్లెలో సీఎం జగన్, ఎమ్మెల్సీ భరత్‌తో పాటు ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలనూ తొలగించలేదు.



పీబీ నత్త మార్గంలో విద్యుత్తు స్తంభాలకు వైసీపీ రంగులు



ఈ రంగులను ఏం చేస్తారు?

కుప్పం: ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చి 24 గంటలు దాటినా నియోజకవర్గంలో వైసీపీ రంగులు ఎక్కడపడితే అక్కడ కనిపిస్తున్నాయి. కుప్పం మండల సచివాలయ ప్రాంగణంలోని రైతు భరోసా కేంద్రానికి వేసిన వైసీపీ మూడు రంగులు అలాగే ఉంచేశారు. గతంలో సీఎం జగన్ సభ జరిగిన పెద్దబంగారునత్త మార్గంలో ప్రతి చెట్టుకు, విద్యుత్తు స్తంభానికి వేసిన రంగులు అలాగే మిగిలిపోయాయి. పలుచోట్ల భవనాలకు, చెట్లకు, స్తంభాలకు వేసిన వైసీపీ రంగులు చెరగలేదు.

వైసీపీ రంగులతో ఉన్నరైతు భరోసా కేంద్రం

కాణిపాకంలో భక్తుల రద్దీ

ఐరాల(కాణిపాకం), మార్చి 16: కాణిపాకం ఆదివారం భక్తుల రద్దీతో కిటకిటలాడింది. సెలవురోజు కావడంతో జిల్లా నలుమూలల నుంచి భక్తులు వరసిద్ధుడి దర్శనార్థం తరలివచ్చారు. ఉదయం నుంచి క్యూలైన్లు భక్తులతో నిండిపోయాయి. క్యూలైన్లలో భక్తులు ఇబ్బంది పడకుండా అధికారులు చర్యలు చేపట్టారు.



శ్రీవారి హుండీ ఆదాయం రూ.3.04 కోట్లు

తిరుమల, మార్చి17(ఆంధ్రజ్యోతి): తిరుమల వేంకటేశ్వరస్వామి హుండీ ఆదాయం రూ.3.04 కోట్లు లభించింది. శుక్రవారం ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు సమర్పించిన హుండీ కానుకలను టీటీడీ శనివారం లెక్కించి ఆదివారం ఉదయం ప్రకటించింది. ఇక, శనివారం 74,351 మంది భక్తులు శ్రీవారిని దర్శించుకున్నారు. 34,164 మంది తలనీలాలు సమర్పించారు.

రూ. 5 లక్షల సిగరెట్ల పట్టివేత

పలమనేరు, మార్చి 17: తమిళనాడునుంచి అక్రమంగా పలమనేరుకు కారులో తీసుకొస్తున్న రూ.5లక్షల విలువ చేసే సిగరెట్లను పట్టుకున్నట్లు పోలీసులు తెలిపారు. పలమనేరు ఎస్ఐ శివశంకర్ తన సిబ్బందితో కలిసి శుక్రవారం రాత్రి పలమనేరు- గుడియాత్తం రహదారిలోని కాలువపల్లి చెక్ పోస్టు వద్ద వాహనాల తనిఖీ చేపట్టారు. ఆ సమయంలో పలమనేరుకు చెందిన పళని తన కారులో రూ.5లక్షల సిగరెట్లు తీసుకొస్తుండగా పట్టుకొన్నారు. గుడియాత్తం నుంచి వీటిని తీసుకొచ్చేందుకు పలమనేరుకు చెందిన సెంథిల్ తన కారును అద్దెకు తీసుకొన్నాడని ఆయన పోలీసులకు చెప్పాడు. సెంథిల్ సూచన మేరకు తాను సిగరెట్లు తీసుకు వస్తున్నట్టు తెలిపాడు. సిగరెట్లకు సంబంధించి రసీదులు లేనందున వాటిని స్వాధీనం చేసుకుని స్టేషన్‌కు తరలించినట్లు ఎస్ఐ తెలిపారు.

రంజాన్ వేళలు
ఇఫ్తార్ (సోమవారం) : సా. 6.29
సహరి (మంగళవారం) : ఉ. 4.58

నేటినుంచి టెన్త్ పబ్లిక్ పరీక్షలు

● ఏర్పాట్లు పూర్తి చేశామన్న కలెక్టర్

చిత్తూరు కలెక్టరేట్, మార్చి 17: జిల్లాలో సోమవారం నుంచి ఈనెల 30వ తేదీ వరకు జరిగే పదోతరగతి పబ్లిక్ పరీక్షలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు కలెక్టర్ షన్మోహన్ తెలిపారు. డీఈవో కార్యాలయంలో కమాండ్ కంట్రోల్‌రూమ్‌ను (సెల్‌ఫోను నెంబరు.. 9032185001) ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. ఈ పరీక్షల నిర్వహణపై ఆదివారం ఆయన మీడియాతో వివరించారు. మొత్తం 22,594 మంది విద్యార్థుల (22,119 మంది రెగ్యులర్, 1395 మంది ప్రైవేటు) కోసం 116 సెంటర్లు ఏర్పాటు చేశామన్నారు. ఆరు సమస్యాత్మక కేంద్రాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడంతో పాటు సిట్టింగ్ స్క్వాడ్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రతి రోజూ ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.45 గంటల వరకు పరీక్షలు జరుగుతాయన్నారు. గంట ముందే విద్యార్థులు పరీక్షాకేంద్రానికి చేరుకోవాలని సూచించారు. పరీక్షా కేంద్రంలోకి ఎలక్ట్రానిక్ పరికరాలు, సెల్‌ఫోన్లు, ఇతర వస్తువులను అనుమతించబోమని స్పష్టంచేశారు. హాల్‌టికెట్ చూపించి ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం చేయవచ్చన్నారు. మాస్ కాపీయింగ్‌కు వీలులేకుండా ప్రశ్నాపత్రాలపై క్యూఆర్ కోడ్ ముద్రించినట్లు తెలిపారు. జిల్లాలో ఏ సెంటర్‌లోనైనా సమస్య ఏర్పడితే వారిపై యాక్టు 25 ఆఫ్ 1997 ద్వారా శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

మధ్యాహ్నం నుంచి 'ఓపెన్' పరీక్షలు

సోమవారం నుంచి 27వ తేదీవరకు మధ్యాహ్నం 2.30 నుంచి 5.30 గంటల వరకు 1147 మంది ఓపెన్ ఎస్ఎస్‌సీ విద్యార్థులకు ఆరు సెంటర్లు, 4059 మంది ఓపెన్ ఇంటర్ విద్యార్థులకు 15 సెంటర్లలో పరీక్షలు జరుగుతాయని కలెక్టర్ వివరించారు. పరీక్షలు సజావుగా జరిగేందుకు అన్ని ఏర్పాట్లు చేశామన్నారు.

హాల్‌టికెట్‌పై హెచ్‌ఎం సంతకం లేకున్నా అనుమతి

చిత్తూరు (సెంట్రల్): టెన్త్ విద్యార్థుల హాల్‌టికెట్‌పై పాఠశాల హెచ్‌ఎం సంతకం లేకున్నా అనుమతి ఉంటుందని ఏపీ ప్రభుత్వ పరీక్షల విభాగం డైరెక్టర్ దేవానందరెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. ఫీజుల కోసం ప్రైవేటు విద్యాసంస్థలు విద్యార్థుల హాల్‌టికెట్ ఇచ్చే అంశంలో ఒత్తిడి తెస్తున్నారనే ఫిర్యాదుల నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నారు. వెబ్‌సైట్ నుంచి హాల్‌టికెట్ డౌన్‌లోడ్ చేసుకుని నేరుగా పరీక్షా కేంద్రంలోకి వెళ్లొచ్చు.

ప్రశ్నపత్రాలపై క్యూఆర్ కోడ్

గత అనుభవాలను దృష్టిలో పెట్టుకుని.. ప్రతి ప్రశ్నపత్రంపై అధికారులు క్యూఆర్ కోడ్‌ను ముద్రించారు. దీని ద్వారా పేపర్ లీకైతే క్షణాల్లో ఎక్కడ, ఏ ప్రాంతం, ఏ సెంటర్ నుంచి లీకైందో ఇట్టే తెలుసుకునే వీలుంది. దీని ఆధారంగా సంబంధిత సెంటర్ అధికారులు, ఇన్విజిలేటర్లు, చీఫ్ సూపరింటెండెంట్లు, విద్యార్థులపై చర్యలు తీసుకునే అవకాశముంది.

33 మంది వలంటీర్ల తొలగింపు

చిత్తూరు, ఆంధ్రజ్యోతి: ఎన్నికలు దగ్గర పడుతున్న నేపథ్యంలో జిల్లాలో ఒక్కసారిగా 33 మంది వలంటీర్లను తొలగించడం తీవ్ర చర్చకు దారి తీసింది. చిత్తూరు మున్సిపల్ కార్పొరేషన్‌లో 18 మంది, పలమనేరు మున్సిపాలిటీలో 12 మంది, గుడిపాల మండలంలో ముగ్గురిని తొలగిస్తూ అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. ఈ తొలగింపు సమాచారం ఆయా వలంటీర్లకు శనివారం అందింది. సర్వేలు, అప్పగించిన పనులు సరిగా చేయలేదని అధికారులు అంటున్నారు. కానీ, నిష్పక్షపాతంగా పని చేస్తుండటంతో వలంటీర్లను తొలగించారని టీడీపీ నాయకులు ఆరోపిస్తున్నారు. ఎలాంటి ముందస్తు నోటీసులు ఇవ్వకుండా, కారణాలు చెప్పకుండా నేరుగా తొలగిస్తూ ఉత్తర్వులు ఇవ్వడంతో ఆ వలంటీర్లు ఖంగుతిన్నారు.

ప్రశాంతంగా గ్రూప్ 1 పరీక్షలు

● 59.83శాతం హాజరు

చిత్తూరు కలెక్టరేట్, మార్చి 17: చిత్తూరులో ఆదివారం పబ్లిక్ సర్వీస్ కమీషన్ గ్రూప్-1 పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు జరిగిన పేపర్ -1 పరీక్షకు 2517 మందికిగాను 1510 మంది (59.99 శాతం) అభ్యర్థులు హాజరయ్యారు. 1007 మంది గైర్హాజరయ్యారు. మధ్యాహ్నం 2 గంటల నుంచి జరిగిన పేపర్-2 పరీక్షకు 2517 మందికిగాను 1502 మంది (59.67 శాతం) హాజరుకాగా, 1015 మంది గైర్హాజరైనట్లు కలెక్టర్ షన్మోహన్ మీడియా సమావేశంలో తెలిపారు. అనంతరం మూడు కేంద్రాల నుంచీ జవాబు పత్రాలను కలెక్టరేట్‌కు... అక్కడ్నుంచి విజయవాడలోని ఏపీపీఎస్సీ ప్రధాన కార్యాలయానికి తరలించారు. ఈ కార్యక్రమంలో డీఆర్వో పుల్లయ్య, కలెక్టరేట్ పరీక్షల విభాగ సూపరింటెండెంట్ గుణశేఖర్ రెడ్డి, ఏపీపీఎస్సీ సెక్షన్ ఆఫీసర్ అమ్మాజీ, అసిస్టెంట్ సెక్షన్ ఆఫీసర్ నాగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



పీవీకేఎన్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల కేంద్రంలో అభ్యర్థులను తనిఖీ చేసి పంపుతున్న అధికారులు


తొడగొడుతున్న యువతి..


పల్నాడు జిల్లా బొప్పూడి ప్రజాగళం సభకు హాజరైన జనం


ప్రజాగళం సభలో ప్రసంగిస్తున్న చంద్రబాబు, మోదీ, పవన్


ప్రజాగళం సభకు వస్తున్న అమరావతి మహిళలు

ప్రజాగళం.. ప్రభంజనం

జనం జనం ప్రభంజనం.. బొప్పూడి ప్రజాగళం జనసంద్రమైంది. ఆదివారం భానుడు భగభగ మండిస్తున్నా తగ్గేదిలేదన్నట్లుగా తరలివచ్చిన అశేష జనం హర్షాతిరేకాలతో బొప్పూడి సభా ప్రాంగణం దద్దరిల్లింది. బొప్పూడికి ఇటు చిలకలూరిపేట, అటు మార్టూరు వరకు 16వ నెంబరు జాతీయ రహదారి జనంతో నిండిపోయింది. యువకులు వృద్ధులు, మహిళలు పిల్లలు అన్న తేడా లేకుండా అన్ని వర్గాల వారు కూటమి జెండాలు చేబూని బొప్పూడి వైపు కదలిరావడంతో జాతీయ రహదారిపై జన సునామీ ఆవిష్కృతమైంది. చలో బొప్పూడి అంటూ కార్యకర్తలు, నేతలు, అభిమానులు ఒక ప్రవాహంలా తరలిరావడంతో మధ్యాహ్నం మూడు గంటలకే సభా ప్రాంగణం మొత్తం జనంతో కిటకిటలాడింది. జనసునామీని చూసిన అధినేతలు ఆనందపరవశులయ్యారు. మోదీ అయితే చంద్రబాబును ప్రత్యేకంగా అభినందించారు. బొప్పూడి వేదికగా త్రిమూర్తులైన ప్రధాని నరేంద్రమోదీ, టీడీపీ, జనసేన అధి నేతలు చంద్రబాబు, పవన్‌కల్యాణ్ ఎన్నికల శంఖారావం పూరించారు. అభివృద్ధి లేక అప్పులు.. దోపిడీ దాష్టీకాలు.. అవినీతి అప్రజాస్వామిక పాలనను అంతం పలకాలని నేతలు పిలిపిచ్చారు. జెండాలు వేరైనా అజెండా ఒకటేనని.. అభివృద్ధి, సంక్షేమం, ప్రజాస్వామ్య పరిరక్షణ కావాలంటే కూటమికి ఓటేసి ఆశలు, ఆకాంక్షలు, సాకారం చేసుకోవాలని సందేశమిచ్చారు. - చిలకలూరిపేట




ప్రజాగళం సభలో మూడు పార్టీల అభిమానులు


ఉత్సాహంగా యువతులు..


బాబు,పవన్, పురంధేశ్వరి అభివాదం...


మోదీతో బాబు మాటామంతీ..




జానపదుల నృత్యాలు..


మహిళలు, కార్యకర్తల ఉత్సాహం..



గురజాల గెలుపునకు కృషిచేయండి!

● డీఏ శ్రీనివాస్‌కు చంద్రబాబు సూచన


చంద్రబాబుతో మాట్లాడుతున్న డీఏ శ్రీనివాస్

చిత్తూరు సిటీ, మార్చి 17: చిత్తూరు నియోజకవర్గ టీడీపీ, బీజేపీ, జనసేన పార్టీల ఉమ్మడి అభ్యర్థి గురజాల జగన్మోహన్ గెలుపునకు కృషిచేయాలని డీఏ శ్రీనివాస్‌కు చంద్రబాబు సూచించారు. ఆదివారం హైదరాబాద్‌లోని ఒక వివాహ వేడుకలో టీడీపీ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు, డీఏ శ్రీనివాస్ పాల్గొన్నారు. ఈసందర్భంగా గురజాల ప్రచార కార్యక్రమాల్లో పాల్గొని భారీ మెజారిటీతో గెలిపించేందుకు కృషిచేయాలని ఆయన సూచించినట్లు తెలిసింది.

పోలింగ్ తర్వాత రోజే చిత్తూరు జాతర

చిత్తూరు కలెక్టరేట్, మార్చి 17: సార్వత్రిక ఎన్నికల పోలింగ్ మే 13వ తేదీన జరగనుంది. ఆ తర్వాత రోజునుంచి చిత్తూరు గంగజాతర జరగనుంది. దీనివల్ల బందోబస్తుకు పోలీసు యంత్రాంగం ఇబ్బంది పడనుంది. 13వ తేది ఉదయం 7 నుంచి సాయంత్రం 5 గంటల వరకు పోలింగ్ జరుగుతుంది. ఒకవేళ ఎక్కడైనా ఇబ్బందులు ఏర్పడితే మే 14న ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు రీపోలింగ్ ఉండొచ్చు. ఇక, ఏటా మేనెల మూడో మంగళ, బుధవారాల్లో జాతర జరగడం 300 సంవత్సరాలకు పైబడి ఉంది. ఈసారి మే 14, 15 తేదీల్లో చిత్తూరు, గిరింపేట, సంతపేట, కట్టమంచి, కొంగారెడ్డిపల్లి, దొడ్డిపల్లిలతో పాటు సరిహద్దు గ్రామాల్లో గంగజాతర జరుగుతుంది. కాగా, మే 13న పోలింగ్ కోసం పోలీసు యంత్రాంగం ఒక్క రోజు ముందుగానే తమకు కేటాయించిన పోలింగ్ కేంద్రాలకు వెళ్ళాల్సివుంటుంది. పోలింగ్ అనంతరం మరుసటి రోజు గంగజాతరకు డీఎస్పీ స్థాయి నుంచి కానిస్టేబుల్ వరకు వందల సంఖ్యలో పోలీసులు బదోబస్తుకు రావాలంటే ఇబ్బంది పడే అవకాశముంది.

తమిళనాడు సరిహద్దులో చెక్‌పోస్టు ఏర్పాటు


చెక్‌పోస్టును పరిశీలిస్తున్న ఎస్ఐలు

పాలసముద్రం, మార్చి 17: ఎన్నికల నియమావళి అమలులోకి రావడంతో పాలసముద్రం మండలం బలిజకండ్రిగ వద్ద పళ్లిపట్టు - షోలింగర్ రోడ్డుపై అంతర్రాష్ట్ర చెక్‌పోస్టును ఆదివారం ఏర్పాటు చేశారు. పాలసముద్రం ఎస్ఐ భారతి, కార్వేటినగరం ఎక్సైజ్ ఎస్ఐ భారతి తమ సిబ్బందితో ఆచెక్‌పోస్టును పరిశీలించారు. ఈ సందర్భంగా పాలసముద్రం ఎస్ఐ మాట్లాడుతూ తమిళనాడు నుంచి మద్యం, నగదు వంటివి తరలించకుండా చెక్‌పోస్టును ఏర్పాటు చేశామన్నారు. ఎలాంటి అక్రమ రవాణా జరిగినా ఉపేక్షించేంది లేదని స్పష్టంచేశారు. 24 గంటలూ తనిఖీలు నిర్వహిస్తారని తెలియజేశారు.

శ్రీవారి తెప్పోత్సవాలకు జోరుగా ఏర్పాట్లు

తిరుమల, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): తిరుమలలో ఈనెల 20 నుంచి 24వ తేదీ వరకు జరగనున్న శ్రీవారి వార్షిక తెప్పోత్సవాలకు ఏర్పాట్లు జోరందుకున్నాయి. ఆలయం పక్కనే ఉన్న పుష్కరిణిలో ఉత్సవర్లు విహరించే తెప్పను ఇంజనీరింగ్ అధికారులు సిద్ధం చేశారు. నీటిపై గాలితో కూడిన డ్రమ్ములను ఏర్పాటు చేసి, దానిపై మండపం రూపంలో ఉండే తెప్పను నిర్మించి.. రంగులు అద్దుతున్నారు.

ఏ రోజు ఎలా.. : తొలిరోజున సీతా లక్ష్మణ ఆంజనేయ సమేతంగా రామచంద్రమూర్తి తెప్పపై మూడు చుట్లు తిరిగి భక్తులకు కనువిందు చేస్తారు. రెండో రోజున రుక్మిణీ సమేతంగా శ్రీకృష్ణస్వామివారు తెప్పలపై మూడుసార్లు విహరిస్తారు. మూడో రోజున శ్రీభూ సమేతంగా మలయప్పస్వామి మూడుసార్లు పుష్కరిణిలో విహరించి, భక్తులను అనుగ్రహిస్తారు. నాల్గవ రోజున ఐదుసార్లు, చివరిరోజు ఏడుసార్లు తెప్పపై పుష్కరిణిలో విహరిస్తారు.

కారు డ్రైవర్ నిర్లక్ష్యంతో బీటెక్ విద్యార్థి దుర్మరణం

● మరో ఇద్దరికి గాయాలు



కారుపై టీటీడీ లోగో, మెంబర్ ఆఫ్ పార్లమెంటు అక్షరాలు - సందీప్ మృతదేహం

తిరుచానూరు, మార్చి 17: ఓ కారు డ్రైవర్ నిర్లక్ష్యం కారణంగా బీటెక్ విద్యార్థి దుర్మరణం చెందాడు. మరో ఇద్దరికి గాయాలయ్యాయి. తిరుచానూరు పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. తిరుపతి జీవకోన చెందిన సందీప్(21) పుత్తూరులోని ఓ ప్రైవేట్ ఇంజనీరింగ్ కళాశాలలో బీటెక్ చదువుతున్నాడు. ఆదివారం పుత్తూరు నుంచి ఇద్దరు స్నేహితులతో కలిసి బైక్‌పై ఇంటికి బయల్దేరాడు. మార్గమధ్యంలోని దామినేడు సమీపంలో జాతీయ రహదారిపై వస్తుండగా.. ముందు వెళుతున్న కారు సడన్ బ్రేక్ వేసింది. దీంతో ఈ కారును వెనుక నుంచి బైక్ ఢీకొంది. ఈ ప్రమాదంలో సందీప్‌కు తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. మిగిలిన ఇద్దరికి కూడా గాయాలయ్యాయి. కారు డ్రైవర్ సడన్ బ్రేక్ వేయడమే ప్రమాదానికి కారణమని సీఐ శ్రీకాంత్‌రెడ్డి తెలిపారు. దాంతో కారు డ్రైవర్‌ని అరెస్టు చేసి, వాహనాన్ని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కాగా, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రుయాస్పత్రికి తరలించగా, సందీప్ తల్లిదండ్రులు అక్కడికొచ్చి బోరున విలపించారు. మిగిలిన ఇద్దరు కూడా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న పోలీసులు తెలిపారు.

ఇంతకీ ఈ కారెవరిది?

ప్రమాదానికి కారణమైన కారుపై టీటీడీ లోగో, మెంబర్ ఆఫ్ పార్లమెంటు అనే అక్షరాలు ఉండటం గమనార్హం. ఈ కారు ఎవరిదన్న విషయంలో పోలీసులు గోప్యతను పాటిస్తున్నట్లు సమాచారం.

ముద్రగడా.. నోరు అదుపులో పెట్టుకో

● వైసీపీలో నెల జీతానికి పనిచేసే నువ్వా పవన్ కల్యాణ్‌ని విమర్శించేది
● జనసేన తిరుపతి ఇన్‌చార్జి మండిపాటు


తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో మీడియాతో మాట్లాడుతున్న కిరణ్‌రాయల్

తిరుపతి(కపిలతీర్థం), మార్చి 17: 'ముద్రగడ పద్మనాభం.. నోరు అదుపులో పెట్టుకొని మాట్లాడు.. వైసీపీలో నెల జీతానికి పనిచేసే నువ్వా మా అధినేత పవన్ కల్యాణ్‌ని విమర్శించేది' అంటూ జనసేన తిరుపతి ఇన్‌చార్జి కిరణ్ రాయల్ మండిపడ్డారు. తిరుపతి ప్రెస్ క్లబ్‌లో ఆయన ఆదివారం మీడియాతో మాట్లాడారు. 'జనసేనానికి రాజకీయ ఓనమాలు రావంటూ మాట్లాడే ముందు నీకు వచ్చుంటే.. నువ్వు, నీ కుమారుడు ఎందుకు పార్టీ పెట్టలేకపోయారు. జనసేన పార్టీ పని అయిపోయింది.. మూసేస్తారని నోటికొచ్చినట్లు మాట్లాడితే సహించేది లేదు. పవన్ కాపుల ద్రోహి అని మాట్లాడే ముందు నీ వెనుక ఎంతమంది కాపులున్నారో ఒకసారి చూసుకో. 2016-17లో చేపట్టిన కాపుల ఉద్యమంలో నువ్వు కాపులకు చేసిన నమ్మకం ద్రోహం అందరికీ తెలుసు. అలాంటి నువ్వు కాపుల ద్రోహి అంటూ మా నేతను విమర్శించడం హాస్యాస్పదంగా ఉంది. వైసీపీలో చేరేందుకు పిఠాపురం నుంచి తాడేపల్లికి వెళ్లిన నీ వెంట నీ కుమారుడు తప్ప ఎవరైనా వచ్చారా? అదేమంటే సెక్యూరిటీ ఇబ్బందులు ఉండటం వల్ల ఎవరినీ తీసుకురాలేదని సాకులు చెబుతావా? ఇక నా కుటుంబాన్ని నాశనం చేసింది చంద్రబాబు అంటూ ఈ రోజు ప్రచారం చేస్తున్నావు కదా.. మరి జగన్మోహన్‌రెడ్డి నీ కుటుంబానికి ఏం చేస్తానని హామీ ఇచ్చాడో చెప్పు చూద్దాం.. జగన్‌కి కాపలా కుక్కలా వ్యవహరిస్తున్న నువ్వా మా నేతను విమర్శించేది? ఇంకోసారి ఇలాంటి విమర్శలు చేస్తే సహించేది లేదు' అని కిరణ్ రాయల్ హెచ్చరించారు. సమావేశంలో నాయకులు రాజారెడ్డి, బాబ్జి, హరికుమార్, రాజు, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

తిరుమలలో పారిశుధ్య కార్మికుల నిరసన

పీఎన్ఎస్ సంస్థ ఇబ్బంది పెడుతోందని ఆరోపణ



తిరుమల, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): కాంట్రాక్టు సంస్థ అయిన పీఎన్ఎస్‌లో పనిచేసే సుమారు 40 మంది పారిశుధ్య కార్మికులు తిరుమలలో ఆదివారం వేకువజామున నిరసన వ్యక్తం చేశారు. తమను ఇబ్బంది పెడుతోందని ఆరోపిస్తూ.. దానికింద పనిచేసే వీరంతా వైకుంఠం క్యూకాంప్లెక్స్, పద్మావతి ఏరియాలో విధులు బహిష్కరించారు. అనంతరం వైకుంఠం క్యూకాంప్లెక్స్ సమీపంలోని కార్యాలయం ముందు బైఠాయించారు. అత్యవసర సమయంలో లీవ్ తీసుకుంటే విధులను నుంచి తొలగిస్తున్నారని, క్రిస్టియన్ల తరహాలో బొట్టు, పూలు, కాళ్లకు గొలుసులు వేసుకోవద్దంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సిబ్బందిని కూడా తగ్గించి పనిభారం పెంచేస్తున్నారని, కాసేపు సేద తీరితే ఫొటోలు తీసి.. విధులకు రావద్దని బెదిరిస్తున్నారని వాపోయారు. ఇదేమని అడిగితే.. 'ఉంటే ఉండు.. లేకపోతే వెళ్లిపో' అంటున్నారని చెప్పారు. విషయం తెలుసుకున్న టీటీడీ హెల్త్ అధికారులు సంఘటనా స్థలానికి చేరుకుని, వారికి సర్దిచెప్పే ప్రయత్నం చేశారు. ప్రయోజనం లేకపోవడంతో హెల్త్ ఆఫీసర్ శ్రీదేవి జోక్యం చేసుకుని సమస్యలను పరిష్కరిస్తామని, విధులకు హాజరుకావాలని కోరారు. దాంతో కార్మికులు విధులకు వెళ్లారు. ఈ సందర్భంగా సీఐటీయూ నాయకుడు సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ.. పీఎన్ఎస్ సంస్థ నిర్వాహకులు తరచూ కార్మికులను వేధిస్తున్నారన్నారు. ఇకనైనా ఈ సంస్థపై తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

విద్యుత్ స్తంభాన్ని ఢీకొన్న బైకు

యువకుడి దుర్మరణం


హరిబాబు మృతదేహం

బంగారుపాళ్యం, మార్చి 17: ద్విచక్రవాహనం అదుపుతప్పి విద్యుత్ స్తంభాన్ని ఢీకొన్న ఘటనలో ఓ యువకుడు మృతిచెందగా, మరొకరు గాయపడ్డారు.బంగారుపాళ్యం పోలీసులు తెలిపిన ప్రకారం.. గంగవరం మండలం గుండగల్లు గ్రామానికి చెందిన హరిబాబు, శ్యామ్ బంగారుపాళ్యం మండలం కొరివారిపల్లె గ్రామంలోని ఓ ఇటుకల బట్టీలో పనిచేస్తున్నారు. శనివారం హరిబాబు తల్లికి ఆరోగ్యం బాలేక మాత్రలు తీసుకురావడానికి సత్రానికి ద్విచక్రవాహనంలో ఇద్దరూ బయలుదేరి వెళ్లారు. మాత్రలు తీసుకుని కొరివారిపల్లెకు వస్తుండగా కల్లూరుపల్లిలోని పొలంవద్ద ద్విచక్రవాహనం అదుపుతప్పి విద్యుత్ స్తంభాన్ని ఢీకొంది. ఈ ప్రమాదంలో గాయపడిన హరిబాబు, శ్యామ్‌ను చిత్తూరుకు తరలించారు. పరిస్థితి విషమించడంతో మెరుగైన వైద్యం నిమిత్తం తిరుపతికి తీసుకెళ్తుండగా మార్గమధ్యంలో హరిబాబు(23) మృతి చెందాడు. కాగా శ్యామ్ తిరుపతిలో చికిత్స పొందుతున్నాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ మల్లప్ప తెలిపారు.

కుప్పం జడ్పీటీసీ భూకబ్జా యత్నం

బాధితుడి ఆరోపణ



డాక్యుమెంట్ చూపుతున్న తిరుమలేశ్

కుప్పం, మార్చి17: కుప్పం మండల పరిధిలోని మల్లానూరు పంచాయతీలో తనకు చెందిన 12.16 ఎకరాల భూమిని వైసీపీకి చెందిన కుప్పం జడ్పీటీసీ సభ్యుడు ఏడీఎస్. శరవణ కబ్జా చేసేందుకు ప్రయత్నించారని బాధిత రైతు తిరుమలేశ్ ఆరోపించారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ సంబంధిత భూమిపై కోర్టులో న్యాయ వివాదం నడుస్తోందన్నారు. అయినా సరే, తరచూ పలుమార్లు తనమీద దాడి చేశారని ఆరోపించారు. తన భూమిని ఆక్రమించడానికి ప్రయత్నిం చడమేకాక, కుప్పం పట్టణంలోని తహసీల్దారు కార్యాలయ ఆవరణలో జడ్పీటీసీ శరవణ తనపై దాడికి చేశారన్నారు. జడ్పీటీసీ నుంచి తనకు ప్రాణహాని ఉందని, పోలీసులు తనకు రక్షణ కల్పించాలని కోరారు. సంబంధిత అధికారులు స్పందించి న్యాయం చేయాలని తిరుమలేశ్ విన్నవించారు.

శాస్త్రోక్తంగా ధ్వజారోహణం



ఉత్సవమూర్తుల ప్రాకారోత్సవం

సోమల, మార్చి 17: ఆవులపల్లెలో కొలువు తీరిన ప్రసన్న వెంకటేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం వేదపండితులు శాస్త్రోక్తంగా ధ్వజారోహణం నిర్వహించారు. మూల విరాట్‌ను పుష్పాలతో అలకరించి అభిషేక పూజలు చేశారు. రక్షాబంధనం, అంకురార్పణ ఉభయదారులుగా గుత్తా చంద్రశేఖర్ నాయుడు కుటుంబ సభ్యులు వ్యవహరించారు. రాత్రి సూర్యప్రభ వాహనంపై శ్రీదేవి, భూదేవి సమేత శ్రీవారిని పల్లకీలో అలంకరించి పురవీధుల్లో ఊరేగించారు. యాదవ సంఘ సభ్యులు ఉభయదారులుగా వ్యవహరించి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

ఇళ్ల స్థలాల పంపిణీపై మహిళల ఆగ్రహం



ఇళ్ల స్థలాల పంపిణీపై మహిళల నిరసన

రామకుప్పం, మార్చి 17 : పట్టణంలో ఇళ్ల స్థలాల పంపిణీ తీరుపై ఇందిరానగర్ వాసులు ఆదివారం ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎన్నో ఏళ్లుగా తాము కూలీనాలీ చేసుకుంటూ అద్దె ఇళ్లలో ఉంటూ ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. నాలుగేళ్లుగా ఇళ్ల స్థలాల కోసం స్థానిక ప్రజాప్రతినిధులు, నేతలు చుట్టూ తిరిగామన్నారు. అయినా తమకు ఇళ్ల స్థలాలు ఇవ్వకపోవడం దారుణమన్నారు. ఇటీవల పట్టణంలో 30 మందికి ఇళ్ల పట్టాలు పంపిణీ చేశారని,ఆ జాబితాలో చాలామంది అనర్హులు ఉన్నారని ఆరోపించారు. ప్రజాప్రతినిధులకు డబ్బులిచ్చిన వారికి, వారికి అనుకూలంగా ఉన్న వారికి మాత్రమే ఇంటి పట్టాలు ఇచ్చారని తెలిపారు. అధికారులు స్పందించి తమకు ఇళ్ల పట్టాలు వచ్చేలా చూడాలని వారు కోరారు.

రామకుప్పంలో సాయుధ బలగాల కవాతు



రామకుప్పం,మార్చి17: రామకుప్పం మండలంలో ఆదివారం కేంద్ర సాయుధ బలగాలు కవాతు నిర్వహించాయి. మండలంలోని బల్ల, కెంచనబల్ల, కొల్లుపల్లె, కొంగనపల్లె, రామకుప్పం పట్టణంలో వారు కవాతు నిర్వహించారు. ఓటర్లలో ధైర్యం నింపేందుకే ఈ కవాతు నిర్వహించినట్లు పోలీసు, రెవెన్యూ అధికారులు తెలిపారు. కార్యక్రమంలో కుప్పం రూరల్ సీఐ ఈశ్వర్‌రెడ్డి, రామకుప్పం తహసీల్దార్ శ్రీధర్, ఎస్ఐ శివకుమార్, డిప్యూటీ తహసీల్దార్ దిలీప్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రాబోయేది టీడీపీ ప్రభుత్వమే : చల్లా బాబు



ఇరికిపెంటలో చల్లాబాబుకు స్వాగతం పలుకుతున్న మహిళలు

సోమల, మార్చి 17: రాష్ట్రంలో రాబోయేది టీడీపీ ప్రభుత్వమేనని పుంగనూరు టీడీపీ ఇన్‌చార్జి చల్లా రామచంద్రారెడ్డి ధీమా వ్యక్తం చేశారు. సోమల మండలంలోని వడ్డిపల్లె, రాశెట్టివారిపల్లె, ఎర్రమిట్ట, ఇరికిపెంట, నడింపల్లె, దాదెంగొల్లపల్లె, ఎమ్మోవారిపల్లె, ఎర్రనాగులపల్లె, మేటిమంద, చింతలవారిపల్లె, గొల్లపల్లెలలో టీడీపీ మేనిఫెస్టో కరపత్రాలను ఇంటింటా అందజేసి టీడీపీ విజయానికి సహకరించాలని ఆయన కోరారు. సూపర్ సిక్స్ పథకాల పట్ల ప్రజల్లో టీడీపీకి ఆదరణ పెరుగుతోందన్నారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు సుబ్రమణ్యం నాయుడు, జనసేన మండల అధ్యక్షుడు సూరిశెట్టి నాగభూషణం, మాజీ వైస్ ఎంపీపీ ఉమాపతి నాయుడు, కొల్లా హరిప్రసాద్, కోటీశ్వరరావు, వై.మోహన్‌నాయుడు, సుబ్బరాయుడు, సాకిబండ రామకృష్ణ, బాలాజీ, అశోక్, పీఎం మల్లికార్జు, పాయల రమేశ్, శివశంకర్, మహేంద్రబాబు, సతీశ్‌నాయుడు, చంద్రశేఖర్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

పేద విద్యార్థుల అభివృద్ధికి కృషి



విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు పంపిణీ చేస్తున్న బలిజ సంఘ నాయకులు

పుంగనూరు, మార్చి17: పేద విద్యార్థులకు ఆర్థిక సహకారం అందించి వారి అభివృద్ధికి అమెరికన్ ప్రోగ్రెసివ్ తెలుగు అసోసియేషన్ కృషి చేస్తోందని ఆ సంస్థ ప్రతినిధి పసుపులేటి విజయప్రకాష్ తెలిపారు. ఆదివారం పుంగనూరు ఉజ్జయిని పాఠశాలలో 30మంది పేద విద్యార్థులకు రూ.6లక్షలు ఉపకార వేతనాలను బలిజ సంఘ నాయకుల ద్వారా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా విజయప్రకాశ్ మాట్లాడుతూ పుంగనూరుకు చెందిన తాను బెంగళూరులో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తూ పేద విద్యార్థులకు ఆర్థిక చేయూత ఇవ్వడానికి అమెరికాలోని స్నేహితులతో కలసి సంస్థ ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో చౌడేపల్లె హెచ్ఎం. రమణయ్య, ఎస్టీయూ అధ్యక్షుడు కడియాల మురళి, దర్శవరం మురళీ, ఉజ్జాయిని అధినేత కృష్ణమూర్తి, కాపు సంఘ నాయకులు నానబాల గణేశ్, పూల మోహన్, సురేశ్, కుమార్ పాల్గొన్నారు.

పూర్వవిద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



బైరెడ్డిపల్లె, మార్చి 17 : బైరెడ్డిపల్లె జడ్పీ ఉన్నత పాఠశాలలో 1988-89లో పదోతరగతి చదివిన విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం కోలాహలంగా జరిగింది. పాత జ్ఞాపకాలను నెమరువేసుకుంటూ బాల్య స్నేహితులతో ఉల్లాసంగా, ఉత్సాహంగా గడిపారు. అనంతరం తమ గురువులను సత్కరించి వారి ఆశీర్వచనాలు అందుకున్నారు.

విద్యార్థిని అదృశ్యం

పుంగనూరు రూరల్ : ఇంటర్ విద్యార్థిని అదృశ్యమైనట్లు ఆమె తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు హెడ్ కానిస్టేబుల్ సుబ్రహ్మణ్యం తెలిపారు. చదళ్లకు చెందిన విద్యార్థిని శనివారం కాలేజీకి అని చెప్పి ఇంటికి రాకపోవడంతో తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

ఎన్నికల కోడ్ ఉల్లంఘిస్తే కఠిన చర్యలు



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఆర్వో శ్రీనివాసులు

కుప్పం, మార్చి 17: ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని కుప్పం నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి శ్రీనివాసులు హెచ్చరించారు. స్థానిక తహసీల్దారు కార్యాలయంలో ఆదివారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ శనివారం సాయంత్రం 3 గంటలనుంచి ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చిందన్నారు. ఎన్నికల కమిషన్ నియమాలను కచ్చితంగా పాటించాలని చెప్పారు. ఎలాంటి రాజకీయపరమైన ఫ్లెక్సీలు, ఫొటోలు, బ్యానర్లు ఉండరాదన్నారు. కుప్పం నియోజకవర్గంలో మొత్తం 2,23,104 మంది ఓటర్లున్నారని తెలిపారు. వీరికోసం నియోజకవర్గ వ్యాప్తంగా 243 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. ఇందులో 58 పోలింగ్ కేంద్రాలను సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలుగా గుర్తించామని చెప్పారు. ఓటర్లు తమ ఓటుహక్కును నిర్భయంగా వినియోగించుకోవాలని కోరారు. ఎన్నికల నిర్వహణకు 24 మంది సెక్టోరల్ ఆఫీసర్లను నియమించామని, వీరితోపాటు శాంతిభద్రతల నిర్వహణకు 949 మంది పోలీసు సిబ్బంది విధులు నిర్వహిస్తారని పేర్కొన్నారు. పోలింగ్ కేంద్రాలలో మౌలిక సదుపాయాలు కల్పిస్తామన్నారు. కుప్పం నియోజకవర్గ పరిధిలో 3 చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి నిరంతరం తనిఖీలు జరుపుతున్నామని ఆర్వో శ్రీనివాసులు తెలిపారు. ఈ సమావేశంలో తహసీల్దారు హరికుమార్, కుప్పం రూరల్ సీఐ ఈశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.

ఇక ఓట్ల తొలగింపు ఉండదు : ఆర్డీవో



పలమనేరు, మార్చి17 : ఓటర్ల జాబితాలో ఇక ఎటువంటి ఓట్ల తొలగింపు వుండదని, చేర్పులు మాత్రం ఫారం-6 ద్వారా ఎన్నికల నోటిఫికేషన్ వచ్చేవరకు వుంటుందని ఆర్డీవో మనోజ్ కుమార్ రెడ్డి తెలిపారు. ఆదివారం సాయంత్రం ఆర్డీవో కార్యాలయంలో మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈనెల 15వరకు వచ్చిన తొలగింపు అభ్యర్థనలను మాత్రమే తొలగిస్తామని, ఒకవేళ ఓటర్ల జాబితాలో ఉన్న వారు మరణించినట్లయితే ఆ వివరాలను నమోదు చేసుకొని పోలింగ్ రోజు వారి ఓటు ఎవరూ వేయకుండా చర్యలు తీసుకుంటామన్నారు. కోడ్ అమలులో ఉన్నందున ముందస్తు పోలీసుల అనుమతి లేకుండా బహిరంగ సభలు, సమావేశాలు నిర్వహించరాదని పేర్కొన్నారు. ప్రతి నియోజకవర్గంలోని తనిఖీ కేంద్రాల వద్ద నాలుగు సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తామని, పొరుగు రాష్ట్రాలనుంచి అక్రమంగా నగదు, మద్యం, వస్తువుల తీసుకు రాకుండా తనిఖీలు చేయిస్తామన్నారు. పలమనేరు నియోజకవర్గంలో మొత్తం 2,66,739 మంది ఓటర్లు వుండగా అందులో పురుషులు 1,32,020, మహిళలు 1,34,719 ఉన్నారన్నారు. నియోజకవర్గంలో 287 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. ఎన్నికల విధులు నిర్వహించడానికి గాను 1728 మంది సిబ్బంది నియామకంతో పాటు సెక్టార్ అధికారులు 34 మంది, రూట్ అధికారులు 37 మందిని నియమిస్తామన్నారు. నియోజకవర్గంలో గత అనుభవాలను దృష్టిలో పెట్టుకొని 87 పోలింగ్ కేంద్రాలను సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలుగా గుర్తించామని, ఈ పోలింగ్ కేంద్రాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు, అదనపు పోలీసు సిబ్బంది ఏర్పాటు వుంటుందన్నారు. ఎన్నికల కమిషన్ జారీ చేసిన గుర్తింపు కార్డులు ఉన్న విలేకరులకు మాత్రమే పోలింగ్ కేంద్రాల వద్ద అనుమతి వుంటుందన్నారు.

చంద్రబాబుతోనే దళితుల సంక్షేమం : టీడీపీ





చందం, అడవిబూదుగూరులలో టీడీపీలో చేరిన కుటుంబాలతో పీఎస్ఎం తదితరులు

కుప్పం/కుప్పం రూరల్, మార్చి 17: చంద్రబాబుతోనే దళితుల సంక్షేమం, అభివృద్ధి సాధ్యమని టీడీపీ నియోజకవర్గ కన్వీనర్ పీఎస్.మునిరత్నం, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డాక్టర్ బీఆర్.సురేశ్‌బాబు అన్నారు. కుప్పం మండలం చందం పంచాయతీ దళితవాడకు చెందిన 25కుటుంబాలు ఆదివారం వైసీపీని వీడి టీడీపీలో చేరాయి. కుప్పం టీడీపీ కార్యాలయంలో వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలుగుదేశం హయాంలో దళితులకు అమలు చేసిన అనేక పథకాలను వైసీపీ అధికారంలోకి వచ్చాక జగన్ రద్దు చేశారన్నారు. టీడీపీ నియోజకవర్గ విస్తరణ విభాగం సభ్యుడు కె.కన్నన్, రాష్ట్ర ప్రొఫెషనల్ విభాగం వైస్ ప్రెసిడెంట్ వెంకటేశ్ ల అధ్యక్షతన దళితుల చేరిక జరిగింది. ఈ కార్యక్రమంలో రామచంద్ర, మేఘనాథం, రాధాకృష్ణ, తులసి, ఇతర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

టీడీపీలోకి 42 కుటుంబాలు

కుప్పం మండలం అడవిబూదుగూరు పంచాయతీలో 42 కుటుంబాలు వైసీపీనుంచి బయటకు వచ్చి టీడీపీలో చేరాయి. ఈ సందర్భంగా టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి పీఎస్.మునిరత్నం, రూరల్ మండల అధ్యక్షుడు ప్రేమ్‌కుమార్ వారిని కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

గతం గుర్తు చేసుకుని బాబు రుణం తీర్చుకుందాం : టీడీపీ



సమావేశంలో మాట్లాడుతున్న గౌనివారి శ్రీనివాసులు

శాంతిపురం, మార్చి17: చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు కుప్పం నియోజకవర్గంలో జరిగిన అభివృద్ధిని ఒకసారి గుర్తు చేసుకుని బాబుకు ఓటు వేసి రుణం తీర్చుకుందామని మాజీ ఎమ్మెల్సీ గౌనివారి శ్రీనివాసులు, మండల పార్టీ అధ్యక్షుడు విశ్వనాథ్ నాయుడు అన్నారు. ఆదివారం శాంతిపురం మండలం సొన్నేగానిపల్లె, కోనేరుకుప్పంలలో మొదటిసారి ఓటు హక్కు పొందిన యువతీయువకులతో టీడీపీ నేతలు సమావేశం నిర్వహించారు. అనంతరం వారు మాట్లాడుతూ మీ భవిష్యత్తు మీ చేతుల్లోనే ఉందని, మీ మొదటి ఓటు మీ భవిష్యత్తు తరాలకు ఉపయోగ పడేలా ఓటు హక్కు వినియోగించుకోవాలన్నారు. అనంతరం మొదటి ఓటు హక్కు పొందిన యువతీ యువకులతో కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు విజయరామిరెడ్డి, ఆర్ఎస్ మణి, బాలు, చంద్రశేఖర్, సర్పంచ్ పుష్పావతి, మంజునాథ్‌రెడ్డి, రాజేంద్ర, సుబ్రమణ్యం, మునేప్పగౌడు, విజయకుమార్, బాబు, బసవరాజు, జయరాజ్, మురళి,కుమార్, వాజీద్, విజయకుమార్, కలీమ్, సుల్తాన్, అర్జునప్ప, శివన్న, సురేస్‌బాబు, మనోహర్, యుగంధర్ తదితరులు పాల్గొన్నారు.

అలాగే మండల పరిధిలోని చిన్నారిదొడ్డి పంచాయతీ గ్రామాల్లో టీడీపీ నేతలు ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ప్రతి ఇంటికి వెళ్లి బాబు ష్యూరిటీ భవిష్యత్తు గ్యారంటీ కరపత్రాలను పంచిపెట్టారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యనిర్వహక కార్యదర్శి డాక్టర్ సురేష్‌బాబు, మాజీ ఎమ్మెల్సీ గౌనివారి శ్రీనివాసులు, మండల టీడీపీ అధ్యక్షులు విశ్వనాథ్‌నాయుడు, మాజీ ఎంపీపీ ఉదయకుమార్, నేతలు విజయరామిరెడ్డి, మాజీ సీఎం పీఏ మనోహర్, చంద్రశేఖర్, నాగరాజు, చంద్రశేఖర్, ఏఎంసీ నాగరాజు, ఆర్ఎస్ మణి, గోపాల్, రుద్రప్ప, పెద్దన్న, నారాయణస్వామి, జయరామిరెడ్డి, నాగభూషణంరెడ్డి, నారాయణరెడ్డి, ఉయ్యాల జయరామిరెడ్డి, చలపతి, జయరాం, రఘుపతి, హరినాథ్‌రెడ్డి, శ్రీనివాసులురెడ్డి, శ్యామల, రూప, పౌలారాణి, హేమవతి, జనసేన నాయకులు కిషోర్, వేణు, నవీన్, బీజేపీ నేతలు పాల్గొన్నారు.

టీడీపీతోనే అభివృద్ధి, సంక్షేమం : పీఎస్



మాట్లాడుతున్న మొదటిసారి ఓటు హక్కు పొందిన యువతి

రామకుప్పం, మార్చి 17 : రాష్ట్రంలో తెలుగుదేశం పార్టీ అవిర్భావంతోనే మారుమూల గ్రామాల్లో అభివృద్ధి జరిగిందని, ప్రజలకు సంక్షేమ పథకాలు తొలుతగా అందాయని ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి పీఎస్ మునిరత్నం, చంద్రబాబు పీఏ మనోహర్ తెలిపారు. ఆదివారం రామకుప్పం మండలం చెల్దిగానిపల్లెలో నూతన ఓటర్ల అవగాహన సమావేశంలో వారు మాట్లాడుతూ ఎన్టీఆర్ తెలుగుదేశం పార్టీని స్థాపించి ఆరు నెలల్లోనే అధికారంలోకి తీసుకొచ్చి గ్రామాల్లో అభివృద్ధి పనులు చేపట్టారన్నారు. అదేవిధంగా అభాగ్యులకు సంక్షేమపథకాలు పరిచయం చేశారన్నారు. అనంతరం చంద్రబాబు తన పరిపాలన దక్షతతో ఒకవైపు సంక్షేమ పథకాలను అమలు చేయడమే కాకుండ అభివృద్ధిని వేగవంతం చేశారు. ఈ విషయాలు కొత్త ఓటర్లు అవగాహన చేసుకుని టీడీపీ వైపు నిలవాలని వారు కోరారు. సమావేశంలో టీడీపీ మండల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఆనందరెడ్డి, నరసింహులు, నాయకులు మునస్వామి, చలపతి, అంజనేయరెడ్డి, చిన్నకృష్ణ, విశ్వనాథ్, వెంకటాచలం, మహమ్మద్‌రఫి, గంటప్పగౌడు, కొల్లుపల్లె బాబు, విజయకుమార్‌రెడ్డి, బాలరాజు పాల్గొన్నారు.

రామకుప్పం, వీర్నమల, ఏర్రచేన్లులో టీడీపీ నాయకులు ఆనందరెడ్డి, భూపతి, విజయకుమార్‌రెడ్డి, శ్రీనాథ్‌రెడ్డి చంద్రబాబు తరుపున ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఆయా కార్యక్రమంలో నేతలు నందారెడ్డి, టివి రవి, ఆదిల్, సతీష్, మంజునాథ్, అమర్, శంకర్, మురళీ, బొరుగులు శీను, గోవిందప్ప, నాగరాజు, పెరుమాళ్, మునిరెడ్డి, జేయి, పాండియన్, తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రం బాగుపడాలంటే చంద్రబాబు సీఎం కావాలి

గుడుపల్లె, మార్చి 17: చంద్రబాబు సీఎం అయితేనే రాష్ట్రం బాగుపడుతుందని టీడీపీ శ్రేణులు పేర్కొన్నారు. ఆదివారం పెద్దభజనవాడ పంచాయతీలోని గ్రామాల్లో టీడీపీ శ్రేణులు ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఐదు సంవత్సరాల వైసీపీ పాలనలో కుప్పం నియోజకవర్గం అభివృద్ధి కుంటపడిందని తెలిపారు. టీడీపీ ప్రవేశపెట్టిన సూపర్ సిక్స్ పథకాలు ప్రజల్లో వెలుగులు నింపుతాయని తెలిపారు. ఇంటింటికి వెళ్లి కరపత్రాలను పంచిపెట్టి చంద్రబాబుకు ఓటు వేయాలని అభ్యర్థించారు. టీడీపీ మండల అధ్యక్షుడు బాబునాయుడు, చంద్రశేఖర్,ముని రాజు, బేటప్ప నాయుడు, హేమాంబర్ గౌడు, జనసేన మండలాధ్యక్షులు అమీర్, నారాయణ మూర్తి, సుందరేష్, ఎల్లప్ప, శ్రీనివాసులు, రమేష్, రామచంద్ర, ప్రకాష్, గోపాల్, వెంకటేశ్, ఎల్లప్ప, సుబ్బు, మంజునాథ్, భానుమూర్తి, లక్ష్మీపతి పాల్గొన్నారు.

ప్రతి కార్యకర్త సైనికుల్లా పనిచేయాలి : ఎమ్మెల్యే

గంగవరం, మార్చి 17 : రాష్ట్రంలో మళ్లీ వైసీపీ అధికారంలోకి రావడంకోసం ప్రతి కార్యకర్త సైనికుల్లా పనిచేయాలని ఎమ్మెల్యే వెంకటేగౌడ పిలుపునిచ్చారు. ఆదివారం లయన్స్‌క్లబ్‌లో పలమనేరు టౌన్, పలమనేరు, గంగవరం మండలాల బూత్ కమిటీ సభ్యుల సమావేశాన్ని ఎమ్మెల్యే అధ్యక్షతన నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ పార్టీ శ్రేణులందరూ గ్రామాల్లో పర్యటించాలన్నారు కార్యక్రమంలో నాయకులు హేమంత్‌కుమార్‌రెడ్డి, చలపతి రెడ్డి, చెంగారెడ్డి, ఎస్‌డీ మురళీకృష్ణ, ప్రహ్లాద, గిరిరాజరెడ్డి, క్యూడీఎస్ రాజేష్, భాస్కర్‌రెడ్డి, కొత్తపల్లి బాలాజి పాల్గొన్నారు.

అభివృద్ధికి నోచుకోని రాంపల్లి కాలనీ



సీసీ రోడ్డుకు నోచుకోని రాంపల్లి కాలనీ

పుంగనూరు రూరల్, మార్చి17: రాంపల్లికాలనీ ఎలాంటి అభివృద్ధికి నోచుకోలేదు. దివంగత సీఎం వైఎస్ పాలనలో రాంపల్లి కాలనీలో పేదల కోసం ఇళ్లు నిర్మించారు. అప్పటి నుంచి కాలనీ అభివృద్ధి గురించి ప్రజాప్రతినిధులు, అధికారులు పట్టించుకోలేదని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆరు నెలలుగా తాగునీటి సమస్యతో ఇబ్బంది పడుతున్నట్లు కాలనీవాసులు తెలిపారు. కాలనీలో దాదాపు 100 కుటుంబాలు నివాసం ఉన్నారు. వీధిలైట్లు లేకపోవడంతో పాముల బెడద అధికంగా ఉన్నట్లు ప్రజలు ఆవేదన వ్యక్తం చేశారు. కాలనీలో సీసీ రోడ్డు, కాల్వలు, తాగునీటి సౌకర్యం, వీధిలైట్లు ఏర్పాటు చేయలేదన్నారు. అధికారులు స్పందించి సమస్యలు తీర్చాలని ప్రజలు కోరుతున్నారు.

టెన్త్ పరీక్షలకు సర్వం సిద్ధం

పుంగనూరు రూరల్, మార్చి17: సోమవారం నుంచి జరిగే టెన్త్ పబ్లిక్ పరీక్షలకు సర్వం సిద్ధం చేసినట్లు ఎంఈవో చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. పట్టణంలో బసవరాజ ప్రభుత్వ పాఠశాల, జడ్పీ బాలికోన్నత పాఠశాల, మేలుపట్ల, కొత్తయిండ్లు, భాష్యం, విజ్ఞానజ్యోతి, బసవరాజ ప్రభుత్వజూనియర్ బాలుర కాలేజీ, చైతన్య చిల్డ్రన్ అకాడమి పాఠశాలలల్లో 1652 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నట్లు తెలిపారు. విద్యార్థులు ఉదయం 8.30గంటలకే పరీక్ష కేంద్రాలకు చేరుకోవాలన్నారు.

టెన్త్ పరీక్షలకు ఏర్పాట్లు

సోమల, మార్చి 17: సోమల హైస్కూల్‌లో 97మంది, కందూరు హైస్కూల్‌లో 108 మంది పెద్దఉప్పరపల్లె హైస్కూల్‌లో 146 మంది విద్యార్థులు టెన్త్ పరీక్షలు రాసేందుకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఎంఈవో శివరత్న తెలిపారు. అలాగే నంజంపేట హైస్కూల్ విద్యార్థులు పెద్దఉప్పరపల్లె హైస్కూల్‌లోను, సూరయ్యగారిపల్లె హైస్కూల్ విద్యార్థులు సోమల హైస్కూల్‌లో పరీక్షా కేంద్రానికి సకాలంలో చేరుకోవాలని సూచించారు.

చౌడేపల్లె : టెన్త్ పరీక్షలకు సర్వం సిద్ధం చేసినట్లు ఎంఈవో కేశవరెడ్డి పేర్కొన్నారు. ఈనెల 18నుంచి 30 వరకు పరీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రెగ్యులర్ విద్యార్థులు 490, సప్లమెంటరీ విద్యార్థులు 16 మంది పరీక్షలు రాయనున్నట్లు తెలిపారు. చౌడేపల్లెలో 2 సెంటర్లు, చారాల, పుదిపట్ల, మర్రిమాకులపల్లె, మేకల చిన్నేపల్లె, కాటిపేరి, పరికిదోన, దాదేపల్లె, విజవాణి హైస్కూళ్లలో పరీక్షకేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అలాగే ఏకొత్తకోట హైస్కూల్ విద్యార్థులు మాత్రం పుంగనూరులో పరీక్షలు రాయనున్నట్లు తెలిపారు.

పురందేశ్వరిని కలిసిన కంచర్ల



కుప్పం, మార్చి 17: బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుపాటి పురందేశ్వరిని ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ మర్యాదపూర్వకంగా కలిశారు. విజయవాడలోని బీజేపీ కార్యాలయంలో ఆదివారం ఆమెను కలిసి శాలువ కప్పి సత్కరించారు. బీజేపీ, జనసేనతో కలిసి టీడీపీ రాష్ట్రంలో ప్రభుత్వాన్ని ఏర్పరచేందుకు కృషి చేస్తామని ఎమ్మెల్సీ ఆమెకు హామీ ఇచ్చారు.

పంటలపై ఏనుగుల దాడులు



కల్లూరు, మార్చి 17: పాళెం పంచాయతీ కోటపల్లి సమీపంలో శనివారం రాత్రి ఏనుగులు మామిడి, పనస తదితర పంటలను ధ్వంసం చేశాయి. కల్లూరులోని రైతు రామచంద్రయ్యకు చెందిన మామిడిచెట్లు, పనసచెట్లు, కోటపల్లిలోని రైతు గోపికి చెందిన పనస, డ్రిప్ పైపులను ఏనుగులు ధ్వంసం చేశాయి.

విద్యార్థి అదృశ్యం

పుంగనూరు రూరల్, మార్చి17: పట్టణంలోని ఓ ప్రైవేటు కాలేజీలో ఇంటర్ చదువుతున్న ఓ విద్యార్థి అదృశ్యమైనట్లు విద్యార్థి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు దర్యాప్తు చేసినట్లు స్టేషన్ హెడ్ కానిస్టేబుల్ సుబ్రహ్మణ్యం తెలిపారు. చదళ్లకు చెందిన విద్యార్థి శనివారం కాలేజీకి అని చెప్పి ఇంటికి రాకపోవడంతో తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఆయన వివరించారు.

శ్రీవారి ఉత్సవాలు ప్రారంభం



పుంగనూరు రూరల్, మార్చి17: పట్టణంలోని కోనేటి వద్ద వెలసిన కల్యాణ వెంకటరమణ స్వామి బ్రహ్మోత్సవాలు ప్రారంభించినట్లు ఆలయ ఇన్‌స్పెక్టర్ మునీంద్రబాబు తెలిపారు. ఆదివారం తెల్లవారుజామున స్వామికి ప్రత్యేకఅలంకరణ చేసి అభిషేకాలు, అర్చనలు చేసి భక్తులకు దర్శనభాగ్యం కల్పించినట్లు తెలిపారు. సాయంత్రం సేనాధిపతి ఉత్సవం అంకురార్పణ జరిగింది. సోమవారం ఉదయం ధ్వజారోహణంతో ఉత్సవాలు జరుగుతాయన్నారు.

గంగమ్మకు ప్రత్యేక పూజలు

సోమల, మార్చి 17: సోమల సమీప బోయకొండ గంగమ్మ ఆలయంలో ఆదివారం అమ్మవారికి వివిధ రకాల పూలతో విశేష అలంకరణ చేశారు. ఈనేపధ్యంలోనే సోమల, అడుసుపల్లె, చెన్నయ్యగారిపల్లె, దిడ్డివారిపల్లె తదితర గ్రామాల భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు.

త్రైతసిద్ధాంత భగవద్గీతపై ప్రచారం

పలమనేరు, మార్చి17 : రానున్న హోలీ పండుగ సందర్భంగా ఆదివారం పలమనేరు ప్రభుత్వ డిగ్రీ కళాశాల పరిసర ప్రాంతాల్లో త్రైతసిద్ధాంత భగవద్గీతపై ప్రబోధ సేవాసమితి ఇందూ జ్ఞానవేదిక సభ్యులు ప్రచారం నిర్వహించారు. వారు ఇంటింటికి వెళ్లి హోలీ పండుగ ప్రాముఖ్యతను వివరించడంతోపాటు త్రైతసిద్ధాంత భగవద్గీత పుస్తకాలను ఉచితంగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో ప్రబోధసేవాసమితి జ్ఞానవేదిక పలమనేరు, బంగారుపాళ్యం కమిటీల అధ్యక్షులు భాస్కర్, బాలాజి, జ్ఞానవేదిక సభ్యులు పాల్గొన్నారు.

బోయకొండలో ప్రత్యేక పూజలు



చౌడేపల్లె, మార్చి 17: ప్రముఖ పుణ్యక్షేత్రమైన బోయకొండ గంగమ్మ ఆలయం భక్తులతో ఆదివారం కిటకిటలాడింది. ఉదయాన్నే అర్చకులు ఆలయాన్ని శుద్ధి చేసి, వేపాకు తోరణాలతో ఆలయాన్ని అలంకరించారు. అమ్మవారిని స్వర్ణాభరణాలతో, పూలతో అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు అందుకున్నారు. భక్తులకు ఏర్పాట్లను ఆలయ చైర్మన్ నాగరాజరెడ్డి, ఈవో చంద్రమౌళి పర్యవేక్షించారు.

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు

పలమనేరు, మార్చి17 : ఉగాది పండుగ సందర్భంగా విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలుగుసాహిత్య సాంస్కృతిక సమితి అధ్యక్షుడు తులసినాథం నాయుడు తెలిపారు. తెలుగు సంవత్సరం గొప్పదనం అనే అంశంపై రెండు పేజీలకు మించని వ్యాసం రాసి పి.తులసినాథం నాయుడు, కళామందిరం, గంగవరం, చిత్తూరు జిల్లా చిరునామాకు ఈనెల 30లోపు చేరే విధంగా పంపాలన్నారు. బాగా రాసిన 50 మంది విద్యార్థులకు బహుమతులు అందిస్తామని తెలిపారు.

పక్కాగా ఎన్నికల కోడ్ అమలు



బోర్డుకు తెల్లరంగు వేస్తున్న పనులను పరిశీలిస్తున్న ఏఈఆర్వో అరుణ

చిత్తూరు, మార్చి 17: నగరంలో ఎన్నికల నియామవళిని పక్కాగా అమలు చేయాలని ఏఈఆర్వో, కమిషనర్ అరుణ నగరపాలక అధికారులను ఆదేశించారు. నగరంలో ఎన్నికల కోడ్ అమలవుతున్న తీరును ఆదివారం ఆమె తనిఖీ చేశారు. ప్రభుత్వ భవనాలు, కార్యాలయాలు, ప్రైవేటు విద్యాసంస్థలు తదితర ప్రాంతాలను పరిశీలించారు. వాటర్‌ప్లాంట్ల వద్ద రాజకీయ పరమైన పెయింటింగ్స్ కనపడకుండా చేయాలని, పార్టీల జెండాలను తొలగించాలన్నారు. పోస్టర్లు, కటౌట్లు, ఫ్లెక్సీలు కనిపించకూడదన్నారు. కమిషనర్ వెంట ఏసీపీ రామకృష్ణుడు, ఇన్‌చార్జి ఎంహెచ్‌వో చిన్నయ్య, ఆర్వో గోపాలకృష్ణ వర్మ, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు.

క్రమశిక్షణ ఉంటే ఏదైనా సాధించవచ్చు



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న ఎంఈవో-2 గణపతి

గుడిపాల, మార్చి 17: క్రమశిక్షణ ఉంటేనే ఏదైనా సాధించవచ్చని ఎంఈవో-2 గణపతి, సీఎస్ఆర్ కళాశాల వ్యవస్థాపకుడు లోకేష్ తెలిపారు. ఆదివారం కళాశాలలో పదో తరగతి విద్యార్థుల వీడ్కోలు సమావేశం జరిగింది. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రామచంద్ర, సీఎస్ఆర్ స్కూల్ ప్రధానోపాధ్యాయులు సుధ, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ అధికారి అర్జున్, మహిళా పోలీసు పావని, మాజీ సర్పంచ్ రెడ్డెప్ప తదితరులు పాల్గొన్నారు.

చిత్తూరును స్మార్ట్ సిటీ చేస్తా: గురజాల



కార్యక్రమంలో మాట్లాడుతున్న జగన్మోహన్

చిత్తూరు రూరల్, మార్చి 17: తనను గెలిపిస్తే చిత్తూరును స్మార్ట్ సిటీగా తీర్చిదిద్దుతానని టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి గురుజాల జగన్మోహన్ తెలియజేశారు. ఆదివారం చిత్తూరు రూరల్ మండలంలోని పెరుమాళ్లకండ్రిగ గ్రామంలో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్టీ రామారావు కష్టపడి తిరుమల అడవుల్లో ఎర్రచందనం మొక్కలు నాటించి 40 సంవత్సరాలు పెంచి పోషిస్తే వైసీపీ నాయకులు ఐదేళ్లలో వాటిని పూర్తిగా నరికి సొమ్ముచేసుకున్నారని విమర్శించారు. అనంతరం 190 రామాపురంలో జరిగిన ఆత్మీ సమావేశానికి ఆయన హాజరయ్యారు. మాజీ ఎమ్మెల్సీ దొరబాబు, మాజీ ఎమ్మెల్యే సీకే బాబు, టీడీపీ జిల్లా మాజీ ఉపాధ్యక్షుడు చంద్రప్రకాష్, మాజీ మేయర్ హేమలత, మోహన్‌రాజ్, శశికర్‌బాబు, మేషాక్, నీలకంఠం నాయుడు తదితరులు పాల్గొన్నారు.

'స్పందన' రద్దు

చిత్తూరు, మార్చి 17: రాష్ట్రంలో ఎన్నికల నియమావళి అమలులోకి వచ్చిన నేపథ్యంలో సోమవారం నగరపాలక కార్యాలయంలో నిర్వహించే స్పందన కార్యక్రమాన్ని రద్దు చేసినట్లు కమిషనర్ అరుణ తెలిపారు.

విద్యుత్ షాక్‌తో మహిళ మృతి

పూతలపట్టు, మార్చి 17: విద్యుత్ షాక్‌తో ఓ మహిళ మృతిచెందిన సంఘటన పూతలపట్టు మండలంలో జరిగింది. రంగంపేట క్రాస్ రోడ్డులో నివాసముంటున్న లక్ష్మీకాంతమ్మ శనివారం రాత్రి తన ఇంట్లో మోటార్ స్విచ్ ఆన్‌చేయగా షాక్‌కు గురై అక్కడికక్కడే మృతిచెందింది.

బెదిరింపులకు భయపడకండి

గుడిపాల, మార్చి 17: కొంతమంది ఫోన్లు చేసి పింఛన్లు, రేషన్ కార్డులు తొలగిస్తామని ఓటర్లను బెదిరిస్తున్నారని, అలాంటి వాటికి ఎవరూ భయపడనవసరం లేదని మండల టీడీపీ ప్రధాన కార్యదర్శి చంద్రమోహన్ తెలియజేశారు. ఆదివారం ఆయన మీడియాతో మాట్లా డుతూ కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలని, రాబోయేది ఉమ్మడి ప్రభుత్వమేనని స్పష్టంచేశారు.

అశోకరాజుకు మాతృవియోగం



నరసమ్మ(ఫైల్‌ఫొటో)

విజయపురం, మార్చి 17: సిద్ధార్థ గ్రూపు విద్యాసంస్థల చైర్మన్, బీజేపీ నాయకులు అశోకరాజు మాతృమూర్తి నరసమ్మ శనివారం రాత్రి మృతిచెందారు. ఆమె తిరుపతి నారాయణాద్రి ఆస్పత్రిలో అనారోగ్యంతో చికిత్స పొందుతూ మృతిచెందారు. మంత్రి రోజా ఆమె మృతదేహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. జిల్లా బీజేపీ అధ్యక్షుడు జగదీశ్వర్‌నాయుడు, బీజేపీ రాష్ట్ర కార్యదర్శి చిలకం ఈశ్వర్ ప్రసాద్, పలువురు టీడీపీ, వైసీపీ నాయకులు నివాళులు అర్పించారు. నేడు సోమవారం ఉదయం 10 గంటలకు విజయపురంలో అంత్యక్రియలు జరగనున్నాయి.

శిలాఫలకం తొలగింపు



శిలాఫలకాన్ని తొలగిస్తున్న తహసీల్దార్ విజయలక్ష్మి, ఎంపీడీవో రాజశేఖర్

గుడిపాల, మార్చి 17: మండలంలోని పాలసముద్రంలో వాటర్‌ప్లాంట్ ప్రారంభోత్సవం కోసం ఏర్పాటు చేసిన శిలాఫలకాన్ని అధికారులు తొలగించారు. వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి విజయానందరెడ్డి వాటర్ ప్లాంట్ ప్రారంభిస్తారని సమాచారం అందడంతో తహసీల్దార్ విజయలక్ష్మి, ఎంపీడీవో రాజశేఖర్ సిబ్బందితో వెళ్లి తొలగించారు. ఎవరైనా బ్యానర్లు, జెండాలు, బోర్డులు పెట్టుకున్నా స్వయంగా తొలగించాలని, లేనిపక్షంలో కేసులు పెడతామని హెచ్చరించారు.

టీడీపీతోనే రాష్ట్రాభివృద్ధి



అత్తూరులో సూపర్‌సిక్స్ పథకం కరపత్రాలను పంపిణీ చేస్తున్న టీడీపీ నాయకులు

నిండ్ర, మార్చి 17: రాష్ట్రంలో టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి ప్రభుత్వంతోనే అభివృద్ధి సాధ్యమని టీడీపీ సీనియర్ నాయకులు అన్నారు. ఆదివారం మండలంలోని అత్తూరు గ్రామ పంచాయితీలో సూపర్ సిక్స్ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ మలర్‌వేణి, నాయకులు గాలి రమేష్‌నాయుడు, విజయ్‌కుమార్, పురుషోత్తంనాయుడు, లోకేష్, గిరి తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా ధ్వజారోహణం



నగరి, మార్చి17: నగరి పట్టణ పరిధిలోని కామాక్షి సమేత కరకంఠేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం ధ్వజారోహణంతో పంగుణోత్తర తిరు తిరుకళ్యాణ బ్రహ్మోత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. ఉదయం హోమపూజలు చేసి మూలవర్లకు అభిషేకం చేశారు. ప్రత్యేక పూజలు, అలంకరణ చేశారు. సాయంత్రం ఆరు గంటలకు సూర్యప్రభ వాహనంపై కామాక్షి సమేత కరకంఠేశ్వరస్వామి విహరిస్తూ భక్తులను అనుగ్రహించారు. ఆలయ ధర్మకర్త సుబ్రమణ్యం భక్తులకు అవసరమైన ఏర్పాట్లను పర్యవేక్షించారు.

టీడీపీతోనే సుపరిపాలన : గురజాల



గురజాల సమక్షంలో టీడీపీలో చేరిన వైసీపీ నేతలు, కార్యకర్తలు

చిత్తూరు సిటీ, మార్చి17: సుపరి పాలన కోసం టీడీపీని గెలిపించాలని ఎమ్మెల్యే అభ్యర్థి గురజాల జగన్మోహన్ కోరారు. ఆదివారం పలు డివిజన్లలో బీజేపీ, టీడీపీ, జనసేన పార్టీల నేతలు ఉమ్మడిగా ఏర్పాటు చేసిన ఆత్మీయ సమావేశాల్లో పాల్గొన్నారు. ఉదయం రెడ్డిగుంట, 12వ డివిజన్ నరిగపల్లె వద్ద నాయకులు, కార్యకర్తలతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా గురజాల మాట్లాడుతూ టీడీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే నగరంలోనే కాకుండా గ్రామీణ ప్రాంతాలు, నగర శివారు ప్రాంతాల్లో మౌలికవసతుల కల్పనపై ప్రత్యేక దృష్టి సారిస్తామని చెప్పారు. నరిగపల్లెలో గుడి, బడి, ఆస్పత్రి ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. సాయంత్రం నగరంలోని 50వ డివిజన్ మురకంబట్టులో టీడీపీ కార్యాలయాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వైసీపీ నేతలు అశోక్, విజయ్, సుధ, శివతోపాటు సుమారు 300 మందికి పైగా వైసీపీ నేతలు, కార్యకర్తలు టీడీపీలో చేరారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే సీకే బాబు, మాజీ ఎమ్మెల్సీ దొరబాబు, నేతలు చంద్రప్రకాష్, కాజూరు బాలాజి, కటారి హేమలత, నీరజాక్షులు నాయుడు, ఆరణి కవిత, గోపి, అశోక్, విజయ్, సుధ, శివ బీజేపీ, జనసేన నేతలు పాల్గొన్నారు.

కోడ్ ఉల్లంఘిస్తే చర్యలు తప్పవు



మీడియాతో మాట్లాడుతున్న ఆర్వో చిన్నయ్య

పూతలపట్టు, మార్చి 17: ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని పూతలపట్టు నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి చిన్నయ్య హెచ్చరించారు. ఆదివారం ఆయన పూతలపట్టు తహసీల్దార్ కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. నియోజకవర్గంలో 260 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. ఐరాలలో 49, పూతలపట్టులో 42, తవణంపల్లెలో 56, బంగారుపాళ్యంలో 68, యాదమరిలో 51 కేంద్రాలు ఉన్నాయన్నారు. పురుష ఓటర్లు 1,08,400, మహిళా ఓటర్లు 1,11,577, ఇతరులు 07 ఓటర్లు కలిపి మొత్తం 2,19,984 మంది ఓటర్లు ఉన్నారని వివరించారు. 67 సమస్యాత్మక, 193 అత్యంత సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలు ఉన్నట్లు గుర్తించామని వివరించారు. ఎన్నికల కోసం మూడు ఫ్లయింగ్ స్క్వాడ్లను ఏర్పాటు చేశామని తెలిపారు. 24 మంది నోడల్ అధికారులు ఉంటారని, వీరంతా పూతలపట్టు తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం నుంచి అందుబాటులో ఉంటారన్నారు. ప్రభుత్వ కార్యాలయాల్లో రాజకీయ నాయకుల చిత్రపటాలను ఉంచరాదన్నారు. ఈ సమావేశంలో పలువురు రెవిన్యూ అధికారులు, ఎలక్షన్ డీటీలు పాల్గొన్నారు.

రమణీయం లక్ష్మీనారాయణుల కల్యాణం



ప్రత్యేక అలంకరణలో స్వామి, అమ్మవార్లు

గంగాధరనెల్లూరు, మార్చి 17: మండలంలోని వేపంజేరి గ్రామంలో వెలసిన లక్ష్మీనారాయణస్వామి కల్యాణోత్సవం రమణీయంగా సాగింది. ఆలయంలో ఆదివారం ఉదయం మొదటగా స్వామి, అమ్మవార్లను సుప్రభాత సేవతో మేల్కొలిపి ప్రత్యేక పూజలు చేశారు. మండపంలో ఉత్సవమూర్తులైన శ్రీదేవి, భూదేవి సమేతుడైన నారాయణస్వామి వార్లకు పట్టువస్త్రాలు, పూలహారాలతో అలంకరించి వేదమంత్రాలు, మంగళవాయిద్యాల నడుమ కల్యాణోత్సవం వేడుకగా జరిపించారు. ఈ పూజలకు వేలూరుకు చెందిన లోకేష్‌రాజ్, పవిత్ర దంపతులు, వరదరాజ్‌లు ఉభయదారులుగా వ్యవహరించారు. టీటీడీ అన్నమాచార్య ప్రాజెక్టుకు చెందిన పీవీ.సుబ్రమణ్యం హరికథ గానం చేశారు. అన్నమయ్య కీర్తనలు, వెంకటేశ్వర భక్తిగీతాలను లక్ష్మీరాజ్యం ఆలపించారు. ఈ కార్యక్రమంలో ఆలయ మేనేజర్ నల్లా వెంకటేశులురెడ్డి, అర్చకులు విష్ణుస్వామి, గోవిందస్వామి, ద్వివేది, పలువురు భక్తులు పాల్గొన్నారు. భక్తులకు ఆలయ నిర్వాహకులు తీర్థప్రసాదాలు అందించారు.

టీడీపీతోనే మహిళాభివృద్ధి సాధ్యం



టీడీపీ మ్యానిఫెస్టో చూపుతున్న ప్రతిమ, తెలుగుమహిళలు

చిత్తూరు సిటీ, మార్చి17: టీడీపీతోనే మహిళాభివృద్ధి సాధ్యమని ఆ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి గురజాల జగన్మోహన్ సతీమణి ప్రతిమ తెలియజేశారు. ఆదివారం స్థానిక 15, 16 డివిజన్లలో మహిళలతో ఆమె ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతిమ మాట్లాడుతూ చంద్రబాబు డ్వాక్రా సంఘాలను ఏర్పాటు చేసి మహిళలు ఆర్థికాభివృద్ధికి కృషిచేశారని తెలిపారు. టీడీపీ అధికారంలోకి వస్తే ఏడాదికి మూడు ఉచిత సిలిండర్లు, ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం, చదువుకునే విద్యార్థులకు ఏడాదికి రూ.15వేలు ఇస్తారని వివరించారు. ఈ ఎన్నికల్లో టీడీపీని భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మహిళా నేతలు వైవీ.రాజేశ్వరి, కార్జాల అరుణ, వరలక్ష్మి, రాణి, శ్రీదుర్గ, నాగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

చిన్ననాటి నుంచే క్రమశిక్షణ అలవర్చుకోవాలి



నృత్య ప్రదర్శన చేస్తున్న చిన్నారులు

చిత్తూరు (సెంట్రల్), మార్చి 17: విద్యార్థులు చిన్ననాటి నుంచే క్రమశిక్షణ అలవర్చుకోవాలని న్యూయార్క్ స్కూల్ చైర్మన్ వి.శ్రీధర్ పేర్కొన్నారు. స్థానిక మురగానిపల్లెలోని న్యూయార్క్ స్కూల్ వార్షికోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు పలువురిని అలరించాయి. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

కమనీయం కేడియ, కామధేను వాహన సేవలు



కేడియ ఉత్సవ సేవలో ఉభయదారులు భక్తులు

చిత్తూరు కల్చరల్, మార్చి 17: స్థానిక కామాక్షి అంబికా సమేత అగస్త్యేశ్వరాలయంలో నాలుగు రోజులుగా స్వామి వారికి పంగుణి మాస బ్రహ్మోత్సవాలు అత్యంత వైభవంగా నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా ఆదివారం ఉదయం కేడియ ఉత్సవం నిర్వహించారు. ఆర్.ఇంద్రావతి, సీకే.రంగనాథం శెట్టిల ఉభయదారులుగా వ్యవహరించారు. సాయంత్రం కామధేను వాహనంపై ఊరేగించారు. ఈ వాహనసేవకు సి.పోతన, ప్రసన్నలక్ష్మి, సూర్యప్రకాష్, రచన, కృష్ణ, శ్రీమతి ఉభయదారులుగా వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ శివప్రసాద్, ఈవో తిమ్మారెడ్డి, అర్చకులు శివాచార్యులు, మల్లికార్జున్, అధికసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

పులివర్తి నానీకి టీఎన్ఎస్ఎఫ్ నేతల సన్మానం



చిత్తూరు సిటీ, మార్చి17: టీడీపీ చిత్తూరు పార్లమెంటు అధ్యక్షుడు పులివర్తి నానీని టీఎన్ఎస్ఎఫ్ నేతలు ఘనంగా సన్మానించారు. చంద్రగిరి ఎమ్మెల్యే అభ్యర్థిగా ప్రకటించడంపై ఆదివారం జిల్లా టీడీపీ కార్యాలయంలో ఆయనను గజమాలతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీఎన్ఎస్ఎఫ్ చిత్తూరు పార్లమెంటు అధ్యక్షుడు త్యాగరాజు, తిరుపతి పార్లమెంటు అధ్యక్షుడు హేమంత్ నేతలు సాయి, ప్రసాద్ పాల్గొన్నారు.

ఎన్నికల నియమావళి విధిగా పాటించాలి



సమావేశంలో ప్రసంగిస్తున్న రిటర్నింగ్ అధికారి, డీఎస్పీ

నగరి, మార్చి17: ఎన్నికల నియమావళిని విధిగా పాటించాలని నగరి అసెంబ్లీ ఎన్నికల రిటర్నింగ్ అధికారి, నగరి ఆర్డీవో వెంకటరెడ్డి, సెక్యూరిటీ అధికారి నగరి డీఎస్పీ నరసింహమూర్తి స్పష్టంచేశారు. స్థానిక ఆర్డీవో కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. నియోజక వర్గం లో 2లక్షలా 1541 మంది ఓటర్లు ఉన్నారని తెలియజేశారు. 229 పోలింగ్ బూత్‌లు ఉన్నాయన్నారు. 1500 ఓట్లకు పైగా వున్న పుత్తూరు పట్టణ పరిధిలోని పోలింగ్ బూత్‌లు 52, 68లలో అదనంగా ఒక్కో బూత్ ఏర్పాటు చేస్తామన్నారు. వడమాలపేటలో 31, పుత్తూరులో 64, నగరిలో 80, నిండ్రలో 25, విజయపురం 29 పోలింగ్ బూత్‌లు ఉన్నాయని వివరించారు. తొలిసారి 5117 మంది ఓటు హక్కు వినియోగించుకోనున్నారని తెలియజేశారు. వలంటీర్లు ప్రచారంలో పాల్గొనరాదని స్పష్టంచేశారు.

రామక్కమ్మ ఆలయంలో ఆరాధనోత్సవాలు

విజయపురం, మార్చి 17: మండలంలోని కోసలనగరం మిట్టూరులో ఆదివారం రామక్కమ్మ ఆలయంలో ఆరాధన ఉత్సవాలు వైభవంగా నిర్వహించారు. ఉదయం మొదలు సాయంత్రం వరకు ప్రత్యేక పూజలు చేశారు. మధ్యాహ్నం అన్నదానం చేశారు. రాత్రి రామక్కమ్మను పురవీధుల్లో ఊరేగించారు. ఆలయ కార్యనిర్వాహకులు వాసుదేవస్వామి, పలువురు భక్తులు పాల్గొన్నారు.

పది పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి

వెదురుకుప్పం, మార్చి 17: సోమవారం నుంచి జరగనున్న పది పరీక్షలకు ఆయా కేంద్రాల్లో మౌలిక వసతుల ఏర్పాట్లు పూర్తిచేశామని ఎంఈవో దామోదరం ఆదివారం తెలిపారు. మండలంలో మూడు పరీక్ష కేంద్రాల్లో 430 మంది పరీక్షలు రాయనున్నారు. వెదురుకుప్పం జడ్పీ ఉన్నత పాఠశాల పరీక్ష కేంద్రంలో 160 మంది, పచ్చికాపల్లం జడ్పీ ఉన్నత పాఠశాలలో 140 మంది, చవటగుంట జూనియర్ కళాశాల కేంద్రంలో 130 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు.

వైసీపీ ఎన్నికల ప్రచారం

ఐరాల/తవణంపల్లె/బంగారుపాళ్యం, మార్చి 16: ఐరాల మండలం పాతపాళ్యం, తవణంపల్లెలో ఆదివారం వైసీపీ అభ్యర్థి సునీల్‌కుమార్‌కు మద్దతుగా మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఎంపీ అభ్యర్థి రెడ్డెప్ప, జడ్పీ చైర్మన్ శ్రీనివాసులు, కాణిపాలక ఆలయ చైర్మన్ మోహన్‌రెడ్డి, ఐరాల ఎంపీపీ మోహన్, జడ్పీటీసీ సుచిత్ర, పార్టీ అధ్యక్షుడు చంద్రశేఖర్‌రెడ్డి, నాయకులు తదితరులు పాల్గొన్నారు. బంగారుపాళ్యంలో నాయకులకు, కార్యకర్తలతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. కుమార్ రాజా, రామచంద్రారెడ్డి, అమరావతి, సోమశేఖర్, శిరీష్ రెడ్డి, దత్తాత్రేయ రెడ్డి, క్రిష్ణమూర్తి, సురేంద్ర బాబు, కిషోర్‌కుమార్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జీడీనెల్లూరులో 34 సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలు



మాట్లాడుతున్న అసిస్టెంట్ ఎన్నికల రిటర్నింగ్ అధికారి రవి

గంగాధరనెల్లూరు, మార్చి 17: గంగాధరనెల్లూరు నియోజకవర్గంలో 34 సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలు ఉన్నట్లు గుర్తించామని అసిస్టెంట్ ఎన్నికల రిటర్నింగ్ అధికారి రవి తెలిపారు. తహసీల్దార్ కార్యాలయంలో ఆదివారం అధికారులతో కలిసి ఆయన విలేకరుల సమా వేశంలో మాట్లాడారు. తొమ్మిది ఫ్లైయింగ్ స్క్వాడ్‌లను ఏర్పాటు చేశామన్నారు. అంతరాష్ట్ర సరిహద్దులైన గంగాధరనెల్లూరు మండలం కొత్తవెంకటాపురం, పాలసముద్రం మండలంలోని బలిజకండ్రిగ, కార్వేటినగరం మండలంలోని కొల్లాగుంట గ్రామాలవద్ద చెక్‌పోస్ట్‌లు ఏర్పాటు చేశామన్నారు. ప్రభుత్వ కార్యాలయాలతో సహా ఎక్కడైనా రాజకీయ నాయకుల ఫ్లెక్సీలు, గోడలపై రాతలు, పోస్టర్లు ఉండరాదని స్పష్టం చేశారు. అభ్యర్థులు ర్యాలీలు, సభలు, సమావేశాలకు అనుమతి తీసుకోవాలన్నారు. ఖర్చుల వివరాలు ఎప్పటికప్పుడు అందజేయాలన్నారు. ఈ నియోజకవర్గం పరిధిలో మొత్తం ఓటర్లు 2,04,669 మంది ఉన్నారు. తొలిసారి 4,641మంది ఓటుహక్కు పొందారని తెలియజేశారు. ఈ సమావేశంలో డిప్యూటీ తహసీల్దార్ తులసిరామ్, ఎన్నికల డీటీ విజయక్రిష్ణ, ఏఎస్‌వో షణ్ముగంనాయుడు, రూపేష్ పాల్గొన్నారు.

ఓటుకు నోటు, మద్యం వద్దు



'ఓటుకు..నోటు, ఓటుకు.. మద్యం వద్దు' అంటూ నగరి మున్సిపాలిటీ 1, 3 వ వార్డుకు చెందిన మహిళలు, రామానుజం చలపతి, మాజీ కౌన్సిలర్ లత పిలుపునిచ్చారు. ప్రలోభాలకు గురికాకుండా నిజాయితీ కలిగిన అభ్యర్థికి ఓట్లు వేసి మంచి సమాజ నిర్మాణానికి సహకరించాలని ఆదివారం ప్లకార్డులు ప్రదర్శించారు. - నగరి